




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 277, పేజీలు - 08

బుధవారం, మార్చి 25, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## తెలంగాణ లో డ్రైవింగ్ లైసెన్స్ కొత్త రూల్స్

**- ఇక 3 దశల విధానం, ఎల్ఎల్ఆర్ ముందు ఎగ్జామ్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న ఎల్ఎల్ఆర్, పర్మనెంట్ డ్రైవింగ్ టెస్ట్ అనే రెండంచెల విధానానికి అదనంగా, రాష్ట్ర రవాణా శాఖ ఇకపై ఆన్‌లైన్

2లో..



## ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్.. మధ్యవర్తులు ఉండరు



**- టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జ్‌లకు శిక్షణా తరగతులు**

అమరావతి (ప్రశ్న న్యూస్) "ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్. పార్టీలో సమూల మార్పులు తీసుకువచ్చి, మరింత బలంగా ముందుకు వెళతాం"

2లో..

## ఇక సెలవు.. ఈ జన్మకు ఇంతే

**- తుది శ్వాస విడిచిన హరీశ్ రాణా**

ఘాజియాబాద్ (ప్రశ్న న్యూస్) హరీశ్ రాణా మంగళవారం తుదిశ్వాస విడిచారు. ప్రమాదవశాత్తు గాయపడి 13 ఏళ్ల క్రితం కోమాలోకి వెళ్లిపోయిన ఘజియాబాద్‌కు చెందిన హరీశ్ రాణా మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవలే హరీశ్ తల్లిదండ్రులు కారుణ్య మరణం కోసం కోరగా, సుప్రీంకోర్టు రెండు వారాల కిందట ఆమోదం తెలిపింది.



2లో..



# గులాబీ కోటలపై కాంగ్రెస్ పంజా

**- రేవంత్ రెడ్డి వ్యూహం ఫలించేనా.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా బలహీనం చేయాలనుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయన మొదటగా ఆ పార్టీ ముఖ్యనేతలను బలహీనం చేయాలనుకుంటున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల కంచుకోటలను బద్దలు కొట్టాలనుకుంటున్నారు. సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్ల ఈ మూడు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఈ కోటలనే లక్ష్యంగా చేసుకుని, గులాబీ దళపతులైన హరీష్ రావు, కేసీఆర్, కేటీఆర్‌లను రాజకీయంగా బలహీనపరిచేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.

**- మూడు నియోజకవర్గాలపై రేవంత్ ప్రత్యేక దృష్టి**

తెలంగాణలో అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్ అగ్రనేతల సొంత నియోజకవర్గాల్లో ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. సిద్ధిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం దీనికి స్పష్టమైన సంకేతం. హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటలో అడుగుపెట్టిన రేవంత్, అక్కడ అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపుతూనే, రాజకీయంగా ఆధిపత్యం సాధించేందుకు పావులు కదుపుతున్నారు. కేవలం గెలవడమే కాదు, ప్రత్యర్థి నాయకత్వాన్ని స్థానికంగా దెబ్బతీయాలన్నది రేవంత్ మాస్టర్ ప్లాన్. రేవంత్ రెడ్డి అనుకుంటున్నంత సులభంగా ఈ మూడు నియోజకవర్గాల్లో మార్పు రావడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**- ఆ నియోజకవర్గాల్లో పార్టీ కాదు.. నాయకత్వమే బలం!**

2లో..

# ఇరాన్ వార్ తో మనకు కష్టాలే

**- సిద్ధంగా ఉండాలన్న మోడీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ మొదలుపెట్టిన దాడులు, వాటికి ప్రతీకారంగా ఆ దేశం చేస్తున్న ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం రాజ్యసభలో కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు భారత్ కు ఆందోళనకరమేనని ఆయన తేల్చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రపంచ దేశాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్ ఎదుర్కొన్న తరహాలో పశ్చిమాసియా సంక్షోభాన్ని కూడా భారత్ అధిగమిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియా పరిస్థితిని పరిష్కరించేందుకు చర్చలు జరపాలని భారత్ సూచించిందన్నారు. మానవత్వంలో ఏ ప్రాణనష్టాన్ని సమర్థించలేమన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 3.75 లక్షల మందికి పైగా భారత్‌కు తిరిగి వచ్చారని గుర్తుచేశారు. ఒక్క ఇరాన్ నుంచే 1000 మంది తిరిగి వచ్చారని, వీరిలో ఎక్కువ మంది వైద్య విద్యార్థులే అన్నారు. భారతీయుల భద్రతకు అన్ని దేశాలు హామీ ఇచ్చాయని, అయినప్పటికీ, కొందరు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు.

2లో..

# తెలంగాణలో భారీగా పెరగనున్న నియోజకవర్గాలు

**- 26 లోక్‌సభ, 179 అసెంబ్లీ స్థానాలకు పెంపు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉందంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాజ్యసభ స్థానాల సంఖ్య పెరగడంతోపాటు ఏపీలో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపుపై కూడా త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది అని తెలుస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసినట్లు తెలుస్తోంది. అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ బిల్లు పాసైతే తెలంగాణలో ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 119



కాగా ఆ సంఖ్య 179కి పెరిగే అవకాశం ఉంది.

**-50 శాతం పెరగనున్న అసెంబ్లీ స్థానాలు**

తెలంగాణలో అసెంబ్లీ స్థానాల

2లో..

## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా సేవలు అవసరం

**- మంత్రి పదవిపై రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. మంత్రి పదవి కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. పదే పదే తనకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. తాను ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలో

2లో..

# అమరావతిలో అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

**- రాయపూడి ఘటనపై సీఎం చంద్రబాబు హైలెవల్ రివ్యూ**

అమరావతి (ప్రశ్న న్యూస్) అమరావతి రాజధాని ప్రాంతంలో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు, ముఖ్యంగా హెచ్‌వోడీ భవనాల సమీపంలో పైపులు తగలబడటంపై సంచలన నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు.

**- వరుసగా పైపులకు నిప్పు**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ అగ్నిప్రమాదం కలకలం రేపింది. రాయపూడి సమీపంలోని హెచ్‌వోడీ భవనాల నిర్మాణ ప్రాంగణంలో సోమవారం రాత్రి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. రాజధాని నిర్మాణ పనుల కోసం మేఘా ఇంజినీరింగ్ సంస్థ అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులకు ఒక్కసారిగా నిప్పంటుకోవడంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అగ్నిప్రమాదాలు జరగడానికి ఏమాత్రం అవకాశం లేని చోట ఇలా వరుసగా జరుగుతుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**- వరుసగా మూడు ఘటనలు.. పెరిగిన అనుమానాలు**

రాజధాని ప్రాంతంలో గత పదిహేను రోజుల్లోనే ఇది మూడో ప్రమాదం. ఈ నెల 11వ తేదీన వెలగపూడి జంక్షన్ వద్ద ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన పైపులు తగలబడ్డాయి. అంతకుముందు కూడా ప్రధాని పర్యటన సమయంలో వెంకటపాలెం సమీపంలో

2లో..

## బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారు

- బీఆర్ఎస్ విద్యార్థి నేతల అరెస్ట్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- 2 లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ ఏమైందని ప్రశ్న
- ప్రశ్నించిన గొంతుకలపై నిర్బంధం ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శ



2లో..

## హైదరాబాద్‌లో మూతపడుతున్న పెట్రోల్ బంక్‌లు

**- నో స్టాక్ బోర్డుల దర్శనం**




2లో..

## ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి

**- బడ్జెట్‌లో ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందన్న భట్టి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడవద్దని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో తాము ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై

2లో..

# విద్యుత్ భారం పడకుండా అప్పులు తీర్చాలి

**- ఇంధన శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష**

- ప్రజలపై భారం వేయకుండా డిస్కంల అప్పులు తీర్చాలని దిశానిర్దేశం
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించాలని సూచన
- ఇంధన రంగంలో ఆవిష్కరణల కోసం ప్రత్యేక ఇంక్యుబేషన్ ఫండ్

అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా విద్యుత్ సంస్థల (డిస్కంల) రుణాలను తీర్చేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించే లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఇంధన శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.




2లో..

## తప్పుడు కేసులు పెరిగిపోతున్నాయి

**- కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు**

- తప్పుడు ఫిర్యాదులు, కల్పిత సాక్ష్యాలపై చర్యలు కోరుతూ వ్యాజ్యం
- చట్టాల్లోని లొసుగుల వల్ల అమాయకులు నష్టపోతున్నారని పిటిషన్‌లో ఆవేదన
- బీఎన్ఎస్ఎస్ చట్టంలోని నిబంధనలపై పునఃసమీక్ష కోరిన పిటిషనర్

3లో..



# గులాబీ కోటలపై కాంగ్రెస్ పంజా

సిద్ధిపేటలో హరీష్ రావుకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్, గజ్వేల్‌లో కేసీఆర్ పట్ల ఉన్న సెంటిమెంట్, సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఆ నాయకులను ప్రజలకు దగ్గర చేశాయి. ఈ ముగ్గురూ తమ నియోజకవర్గాల్లో కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా, కుటుంబ సభ్యులుగా స్థిరపడిపోయారు. వారిని ఢీకొనాలంటే కేవలం అధికార బలం సరిపోదు, అంతకు మించిన ప్రజాదరణ ఉన్న నేతలు కాంగ్రెస్ వైపు ఉండాలి. ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం. సిద్ధిపేటలో హరీష్ రావుకు దీటైన నాయకుడు కానీ, సిరిసిల్లలో కేటీఆర్‌ను అడ్డుకోగల చరిష్మా ఉన్న నేత కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కనిపించడం లేదు.

### - కాంగ్రెస్‌కు మాస్ లీడర్ల కొరత

ద్వితీయ శ్రేణి నాయకత్వం బలపడకుండా, కేవలం పైస్థాయి నుంచి చేసే విమర్శలు ఓట్లుగా మారవు. స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, బీఆర్ఎస్ అగ్రనేతల ప్రభావాన్ని తగ్గించగలిగే మాస్ లీడర్ల అవసరం కాంగ్రెస్‌కు ఉంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు. గతంలో ఇంద్రుడిలా వెలిగిన ఎందరో అగ్రనేతలు తమ సొంత గడ్డపైనే ఓటమి పాలైన చరిత్ర ఉంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. ప్రభుత్వ పథకాలను ఈ నియోజకవర్గాల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, బీఆర్ఎస్ కేడర్‌ను ఆకర్షించడం ద్వారా ఆ కోటలను బీటలు వారేలా చేయవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారనే ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడం రేవంత్ ముందున్న సవాలు.

### - రేవంత్ రాజకీయాన్ని తక్కువ అంచనా వేయలేం!

రేవంత్ రెడ్డి సంకల్పం గట్టిగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వాన్ని మర్చిపోయేలా చేసే స్థాయి ఉన్న నేతలు స్థానికంగా ఎదిగితేనే కాంగ్రెస్‌కు అక్కడ భవిష్యత్తు ఉంటుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయగలిగితే, అది తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మలుపు అవుతుంది. ఇప్పటికే అక్కడ బలమైన నేతల్ని గుర్తించి ప్రోత్సహించే వ్యూహాన్ని రేవంత్ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో బలమైన పోటీ ఇచ్చే అభ్యర్థుల్ని రెడీ చేసుకున్నా అది బీఆర్ఎస్ పార్టీ వ్యూహాల్లో కీలకమైన మార్పులు తెస్తుంది. మరి రేవంత్ రాజకీయం ఈ సారి ఆయన వ్యూహాలకు తగ్గట్లుగా సాగుతుందా లేదా అని వేచి చూడాలి.

# తెలంగాణ లో డ్రైవింగ్ లైసెన్స్ కొత్త రూల్స్

రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్ టెస్ట్ తప్పనిసరి చేయనుంది. ఏప్రిల్ మొదటి వారం నుండి అమలులోకి రానుందని తెలుస్తోంది. తెలంగాణలో ప్రతి ఏడాది సుమారు 7,500 మంది రహదారి ప్రమాదాల్లో చనిపోతుండగా వేలాది మంది గాయాల పాలవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా శాఖ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నూతన డ్రైవింగ్ లైసెన్స్ విధానంపై కసరత్తు చేసింది. ఇది అమల్లోకి వస్తే రహదారి క్రమశిక్షణ పెరిగి ప్రాణనష్టం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

### - డ్రైవింగ్ లైసెన్స్‌కు మూడంచెల విధానం

ఈ విధానం ప్రకారం, లెర్నర్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునే ముందే అభ్యర్థులు రహదారి భద్రతపై అవగాహన పరీక్షను పూర్తి చేయాలి. ఇందుకోసం రవాణా శాఖ 6 ప్రత్యేక మాడ్యూళ్లను తయారుచేసింది. ఒక్కో మాడ్యూల్ 30 నిమిషాల చొప్పున మొత్తం 3 గంటల పాటు సాగే ఈ ట్రైనింగ్, ఎగ్జామ్‌ను అభ్యర్థులు ఇంటి నుంచే పూర్తి చేయవచ్చు. కెమెరా ఉన్న కంప్యూటర్, ల్యాప్‌టాప్ ద్వారా ఈ మాడ్యూల్ పూర్తి చేయవచ్చు. ఈ పరీక్షలో క్వాలిఫై అయి పొందే సర్టిఫికేట్ నంబర్ ఉంటేనే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు మీరు అర్హులు అవుతారు. రెండో దశలో లెర్నర్ లైసెన్స్ కోసం పరివాహన్ వెబ్‌సైట్ లేదా లేదా తెలంగాణ రవాణా శాఖ వెబ్‌సైట్‌లో ఫారం 1, 1ఏ (మెడికల్ సర్టిఫికేట్)తో ఫిల్ చేయాలి. నిర్వహించే ఆన్ లైన్ ఎగ్జామ్ పాస్ అయితే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మూడో దశలో పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎల్ఎల్ఆర్ వచ్చిన 30 రోజుల తరువాత నుంచి 6 నెలల్లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసి ఆర్టీవో ఆఫీసుకు వెళ్లి అధికారులు నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు హాజరుకావాలని అధికారులు తెలిపారు.

### - తెలంగాణలో 3 దశల్లో డ్రైవింగ్ లైసెన్స్.. పూర్తి ప్రక్రియ

డ్రైవింగ్ లైసెన్స్ (డిఎల్) పొందడానికి ఇప్పుడు 3 దశల ప్రక్రియ పూర్తి చేయాలి. ఏప్రిల్ 2026 నుండి ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలి. కొత్త డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు ప్రక్రియ స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇదే..

– ఫేజ్ 1: ఆన్‌లైన్ రోడ్డు భద్రతా అవగాహన పరీక్ష రాయాలి

ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు ముందు 6 మాడ్యూల్స్‌తో కూడిన 3 గంటల ఆన్‌లైన్ క్లాస్ వినాలి. తరువాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికేట్ నంబర్ పొందాలి.

– ఫేజ్ 2: లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) కోసం దరఖాస్తు చేయాలి

పరివాహన్ వెబ్‌సైట్ లేదా రాష్ట్ర రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఫారం 1, 1ఏ (మెడికల్ సర్టిఫికేట్)తో అప్లై చేసుకోవాలి. ఆన్‌లైన్ పరీక్షలో పాస్ అయితే ఎల్ఎల్ఆర్ జారీ అవుతుంది.

– ఫేజ్ 3: శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (డిఎల్) కోసం దరఖాస్తు

ఎల్ఎల్ఆర్ వచ్చిన 30 రోజుల తర్వాత నుంచి 6 నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలి. తరువాత ఆర్టీవో ఆఫీసు వద్ద డ్రైవింగ్ ట్రాక్‌పై అధికారులు నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు హాజరు కావాలి.

### - అర్హత, కావాల్సిన డాక్యుమెంట్స్

వయస్సు: 18 ఏళ్లు నిండి ఉండాలి (గేర్ లేని టూవీలర్‌కు 16 ఏళ్లు).డాక్యుమెంట్స్: ఆధార్ కార్డ్, అడ్రస్ ప్రూఫ్, వయసు ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు50 ఏళ్లు పైబడిన వారు తప్పనిసరిగా డాక్టర్ నుండి ఫారం 1ఏ మెడికల్ సర్టిఫికేట్ తెచ్చి సబ్మిట్ చేయాలి.

### - లైసెన్స్ వ్యాలిడిటీ

ప్రైవేట్ వాహనాలకు (నాన్ ట్రాన్స్ పోర్ట్) అయితే 20 ఏళ్ల వరకు లేదా 50 ఏళ్ల వయస్సు వచ్చే వరకు చెల్లుతుంది. ఆ తర్వాత ప్రతి 5 ఏళ్లకు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.

# తెలంగాణలో భారీగా పెరగనున్న నియోజకవర్గాలు

సంఖ్య 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోని ప్రస్తుత అసెంబ్లీ స్థానాల సంఖ్య కంటే 50 శాతం పెంచాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ స్థానాలతోపాటు పార్లమెంట్ స్థానాలను కూడా పెంచాలనే యోచనలో కేంద్రం ఉందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం సూచనప్రాయంగా తెలియజేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా భేటీ నిర్వహించినట్లు సమాచారం. త్వరలోనే కాంగ్రెస్ పార్టీతోనూ ఈ సీట్ల పెంపు అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### - కొత్త స్థానాలతోనే 2029 ఎన్నికలు

అయితే నియోజకవర్గాల సంఖ్య పెంపు కంటే ముందే మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

### - మహిళలకు 60 అసెంబ్లీ స్థానాలు

రాష్ట్ర విభజన సమయంలోనే నియోజకవర్గాల పునర్విభజన అంశం చర్చకు వచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలుకాలేదు. తాజా పరిణామాలతో ఈ అంశం మళ్లీ రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తావన వచ్చింది కానీ ఇప్పటి వరకు దాని ప్రస్తావన రాలేదు. అయితే త్వరలోనే ఈ అంశానికి సంబంధించి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని 2029 నాటికి కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. పునర్విభజన చట్టంలోని హామీల మేరకు అసెంబ్లీ స్థానాల పెంపు జరిగే అవకాశం ఉంది అని తెలుస్తోంది. తెలంగాణలో ప్రస్తుతం 119 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే కొత్తగా 50 శాతం స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అంటే 60 అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. వీటితో కలుపుకుంటే ఏపీలో మొత్తం అసెంబ్లీ స్థానాల సంఖ్య 179కు చేరుకోనుంది. వీటిలో 60 అసెంబ్లీ స్థానాలు మహిళలకు రిజర్వ్‌డ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

### - 26కి పెరగనున్న లోక్‌సభ స్థానాలు

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అయితే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో కొత్తగా 9 లోక్‌సభ స్థానాలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ఏపీలోక్ సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26కి పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఈ పార్లమెంట్ స్థానాల్లో 9 స్థానాలు మహిళలకు కేటాయించే అవకాశం ఉంది.

# ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్.. మధ్యవర్తులు ఉండరు

అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను మధ్యవర్తులు లేకుండా నేరుగా గుర్తించడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జ్‌ల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీని ఒక యూనివర్సిటీతో పోల్చిన లోకేశ్, ఎంతోమంది గొప్ప నాయకులను తయారుచేసిన కార్ఖానా అని అభివర్ణించారు. "తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రెండో ముఖ్యమంత్రి కూడా మన తెలుగుదేశం యూనివర్సిటీ నుంచి వచ్చినవారే. గతంలో గండిపేటలో నిరంతరం శిక్షణా తరగతులు జరిగేవి. వాటి ద్వారా ఎంతోమంది ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎదిగారు. ఇప్పుడు ఏడాదికి కనీసం 300 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు. పదవులు ఇస్తున్నప్పటికీ, వారి బాధ్యతలేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నామని, ఈ శిక్షణ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తామని తెలిపారు.

### - అహంకారం వద్దు.. ప్రజలు గమనిస్తున్నారు

2024 ఎన్నికల్లో కూటమి సాధించిన చారిత్రక విజయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. "2019 నుంచి 2024 మధ్య మనపై ఎన్నో దాడులు జరిగాయి. అక్రమ కేసులు బనాయించారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. చంద్రబాబు గారిని 53 రోజులు అన్యాయంగా జైల్లో నిర్బంధించారు. వీటన్నిటిపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94 శాతం సీట్లు గెలిచాం. వైసీపీ అహంకారం వల్లే 11 సీట్లకు పరిమితమైంది. మనం ఆ తప్పు చేయకూడదు. నాకు రాష్ట్రంలో మూడో అత్యధిక మెజార్టీ వచ్చిందని అహంకారానికి పోను. ఇది నాపై బాధ్యతను పెంచింది. ప్రజలు అహంకారాన్ని సహించరని అందరూ గుర్తుంచుకోవాలి" అని హితవు పలికారు.

### - పార్టీలో సరికొత్త సంస్కరణలు

పార్టీలో అంతర్గత సంస్కరణలపై లోకేశ్ కీలక ప్రకటనలు చేశారు. "పార్టీలో ఒకే వ్యక్తి ఒకే పదవిలో మూడుసార్లు కంటే ఎక్కువగా ఉండకూడదు. క్లస్టర్ ఇంఛార్జ్ స్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు ఎదిగేలా మార్పులు తీసుకురావాలి. గ్రామ పార్టీ అధ్యక్షుడు కూడా పొలిట్ బ్యూరోలో కూర్చోవాలి. ఈ మార్పుల కోసం నేను నాలుగేళ్లుగా పోరాడుతున్నా. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఇది నాకు నాలుగోసారి. ఈసారి ఆ బాధ్యత వద్దని, వేరేవారికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు గారిని కోరాను" అని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ 'మై టీడీపీ' యాప్ ద్వారా కార్యకర్తల పనితీరును నేరుగా గుర్తిస్తామని చెప్పారు. "ఇకపై మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. పనిచేసేవారికీ, చేయనివారికీ తేడా స్పష్టంగా తెలుస్తుంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబరిచిన 19 మంది కార్యకర్తలను చంద్రబాబు గారితో పాటు వేదికపై కూర్చోబెడతాం. కార్యకర్తే అధినేత అనేది మా నినాదం" అని లోకేశ్ ఉద్ఘాటించారు.

### - పార్టీయే సొంతిల్లు.. ప్రభుత్వ బాధ్యతలు కిరాయి ఇల్లు

తాను వారంలో ఒకరోజు తప్పనిసరిగా పార్టీ కార్యాలయానికి సమయం కేటాయిస్తున్నానని, పార్టీకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని లోకేశ్ స్పష్టం చేశారు. "తెలుగుదేశం పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. మనమంతా కలిసికట్టుగా పనిచేస్తే 175 స్థానాల్లో విజయం సాధించవచ్చు. నాకు 91 వేల మెజార్టీ వచ్చినా, కొన్ని బూత్‌లలో వెనుకబడ్డాం. వాటిపై ఇప్పటినుంచే దృష్టి సారించాను. బలహీనంగా ఉన్న బూత్‌లను బలోపేతం చేసే బాధ్యత క్లస్టర్ ఇంఛార్జ్‌లు తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో జరిగిన దాడులను మర్చిపోవద్దని, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, అమర్ నాథ్ గౌడ్, తోట చంద్రయ్య వంటి వారిపై జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని సూచించారు.

# కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా సేవలు అవసరం

తెలంగాణలో హస్తం పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తారని హామీ ఇచ్చారని తరచూ పేర్కొంటూనే ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా ఇంకా తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై బహిరంగంగానే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మరోసారి మంత్రి పదవిపై స్పందించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాను మంత్రి పదవి కోసం పరితపించడం లేదని పేర్కొన్నారు. కానీ మంత్రి పదవి విషయంలో గతంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ హామీ ఇచ్చిందని అయితే ఆ హామీపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తనకు తెలియదని పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం రోజున శాసనసభ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. తనకు మంత్రి పదవిస్తే కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తనకు ఏ పదవి లేకపోయినా ప్రజల్లో మాత్రం తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మళ్లీ అధికారం రావాలంటే తన లాంటి ఉద్యమకారుల సేవలు ఎంతో అవసరమని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి ఇబ్బంది లేదని తేల్చి చెప్పిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సోమవారం రోజున సీఎంతో ప్రత్యేక భేటీ ఏం లేదని స్పష్టం చేశారు. తాము ఇద్దరం ఎదురుపడ్డామని ఆ క్రమంలోనే ఒకరినొకరు పలకరించుకున్నామని క్లారిటీ ఇచ్చారు. ఇక మంగళవారం కేటీఆర్‌తోనూ సాధారణ విషయాలపైనే మాట్లాడినట్లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. 2018లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ 88 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను వారి పార్టీలో చేర్చుకోవడం తప్పు అని కేటీఆర్‌కు చెప్పినట్లు రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు.

# హైదరాబాద్‌లో మూతపడుతున్న పెట్రోల్ బంక్‌లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడుతోంది. ప్రపంచ దేశాలకు కీలక చమురు రవాణా మార్గంగా ఉన్న హర్మూజ్ జలసంధి గుండా చమురు నౌకలను వెళ్లకుండా ఇరాన్ అడ్డుకోవడంతో ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది ఇలాంటి పరిస్థితుల్లో మన దేశంలో కూడా చమురు కొరత ఏర్పడనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో ఇటీవల పెట్రోల్ బంకులు మూతపడుతుండటంతో మిగిలిన పెట్రోల్ బంకుల వద్దకు జనం భారీగా చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలోని చాలా పెట్రోల్ బంకుల ముందు నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ గ్యాస్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో పెట్రోల్ బంకుల ముందు వాహన దారులు కిలోమీటర్ల మేర పడిగాపులు కాస్తున్నారు. పాతబస్తీలోని సీఎన్‌జీ ఫిల్లింగ్ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు భారీగా ఎదురుచూపులు చూస్తున్నారు. పాతబస్తీతోపాటు బహదూర్‌పురా, అంబర్‌పేట్, తాడ్‌బండ్, హస్సన్ నగర్ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి.మరోవైపు హైదరాబాద్‌లోని మిగిలిన పలు పెట్రోల్ బంకుల వద్ద తెల్లవారుజాము నుంచే వాహనదారులు కిక్కిరిసిపోయారు.

లక్డీకపూల్, గచ్చిబౌలి, దిల్‌షుఖ్ నగర్, అంబర్‌పేట్ వంటి ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల ముందు ఆటోలు రోడ్లపైనే నిలిపేశారు. డబ్బులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ బంకులకు సరఫరా చేస్తామంటూ ఆయిల్ కంపెనీలు, ఇటీవలి కాలంలో కొత్తగా మెలిక పెడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే డబ్బులు లేక చాలా మంది పెట్రోల్ బంక్ డీలర్లు చమురు కొనడం ఆపేయడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని కానీ ఇప్పుడు చమురు కొరత నేపథ్యంలో క్రెడిట్ ఇవ్వకపోవడంతోనే బంకులు మూసివేసే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నాయి.

అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చమురు కొరత ఆరోపణలను కొట్టివేస్తోంది. రాష్ట్రంలో సరిపడా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. ఎవరూ భయపడాల్సిన పని లేదని, ఆందోళనకు గురై పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ మరింత కావాలని పెట్రోల్ బంకుల ముందు క్యూ కట్టొద్దని సూచిస్తోంది. వాహనదారులు అనవసరంగా కంగారు పడొద్దని తేల్చి చెప్పింది. దేశంలో ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు కూడా వెల్లడించారు.

# ఇక సెలవు.. ఈ జన్మకు ఇంతే

దీనితో ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు అతడికి చికిత్స నిలిపివేశారు. హరీశ్ రాణా పంజాబ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో 2013 ఆగస్టు 20న హాస్టల్ భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. కుమారుడి చికిత్స కోసం ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ క్రమంలో కారుణ్య మరణానికి అనుమతించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# అమరావతిలో అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

ఇలాంటి ప్రమాదాలే జరిగాయి. సాధారణంగా ఈ పైపులు హెడీపీఈ, పీవీసీ తయారీవి. త్వరగా అంటుకునే స్వభావం కలవి కావు, కానీ ఎండిపోయిన గడ్డిని పైపుల వరకు వరుసగా పేర్చి నిప్పు పెట్టినట్లు కొన్ని చోట్ల ఆనవాళ్లు లభించడంతో ఇది ప్రమాదం కాదు కుట్ర అనే అనుమానాలు బలపడుతున్నాయి.

### - సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం - ప్రత్యేక విచారణ

అమరావతిలో జరుగుతున్న ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని పనులు ఊపందుకుంటున్న తరుణంలో ఇలాంటి ఘటనలు జరగడం యాదృచ్ఛికం కాదని అభిప్రాయపడ్డారు. దీని వెనుక ఏదైనా విద్రోహ చర్య . కుట్ర కోణం ఉందేమో తేల్చాలని డీజీపీ, సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. నిర్మాణ సామగ్రిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు.

### - భద్రత పెంపు.. ఫోరెన్సిక్ దర్యాప్తు

ముఖ్యమంత్రి ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగారు. ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలంలో నమూనాలను సేకరించాయి. ఎవరైనా ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారా లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ సాగుతోంది. రాజధాని ప్రాంతంలో నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచిన చోట్ల సీసీ కెమెరాల నిఘాను పెంచాలని, సెక్యూరిటీని కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారా అన్న కోణంలో నిఘా వర్గాలు కూడా సమాచారాన్ని సేకరిస్తున్నాయి. అమరావతిలో వరుసగా జరుగుతున్న ఈ అగ్నిప్రమాదాలు ఇప్పుడు రాజకీయంగాను, పరిపాలనా పరంగాను పెద్ద చర్చకు దారితీశాయి. ప్రభుత్వం చేపట్టే విచారణలో ఎలాంటి విషయాలు బయటపడతాయో వేచి చూడాలి.

# ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి

చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడం పట్ల కూడా ప్రతిపక్షం ఓర్వలేకపోతోందని విమర్శించారు. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆర్థిక సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో బీమా సౌకర్యం కల్పించామని వెల్లడించారు. సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంటే బీఆర్ఎస్ వారికి వినడానికి కూడా సమయం లేనట్లుగా ఉందని విమర్శించారు. తాను డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశపెడుతుంటే ప్రతులు చించి సభ నుంచి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మేం చెప్పింది వినాలి లేదంటే వెళ్లిపోతామన్నట్లుగా బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందని మండిపడ్డారు.ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. నాడు రైతు బంధు పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల పథకంగా మార్చుకుందని ఆరోపించారు. 2018లో ప్రజలు ఓట్లు వేయడానికి వరుసలో నిలబడిన సమయంలో రైతు బంధు నిధులు జమ చేశారని ఆరోపించారు. కానీ తాము రైతు భరోసా నిధులు విడుదల చేసింది ఎన్నికల కోసం కాదని పేర్కొన్నారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు. తమ ప్రభుత్వం రాగానే ఒకేసారి రైతు రుణమాఫీ చేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా చేయాలని పెట్టుకున్నామని మల్లు భట్టివిక్రమార్క తెలిపారు.

# విద్యుత్ భారం పడకుండా అప్పులు తీర్చాలి

ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ కొనుగోళ్ల ఖర్చు తగ్గింపుపై రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ సంస్కరణల ద్వారా 2028-29 నాటికి యూనిట్‌పై రూ.1.32 భారాన్ని తగ్గించి, కొనుగోలు ధరను రూ.4.10కి తీసుకురాగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ధరను రూ.4కు తగ్గించేలా చూడాలని సూచించారు. సమర్థ నిర్వహణ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.339 కోట్లు ఆదా చేశామని అధికారులు తెలపగా, పొదుపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

### - ఇంధన రంగం గేమ్ ఛేంజర్

"ఉమ్మడి రాష్ట్రంలోనే దేశంలో తొలిసారిగా ఎనర్జీ ఆడిటింగ్ వంటి సంస్కరణలు తెచ్చాం. ఇప్పుడు ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తోంది. ఇంధన రంగం భవిష్యత్తులో గేమ్ ఛేంజర్ కానుంది. తక్కువ ఖర్చు, పర్యావరణ హిత విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం కాబట్టే గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి," అని చంద్రబాబు అన్నారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలను ప్రజలకు, రైతులకు మరింత చేరువ చేయాలని సూచించారు. సోలార్ విద్యుత్‌లో దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా నిర్దేశించారు.

### - ఎనర్జీ యూనివర్సిటీ, ఇంక్యుబేషన్ ఫండ్

రాష్ట్రంలో ఇంధన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఒక 'ఎనర్జీ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌లకు ఆర్థిక చేయూతనిచ్చేలా 'ఇంక్యుబేషన్ ఫండ్' ఏర్పాటు చేయాలని సూచించారు. "మన విద్యుత్ సంస్థలు ఇతర రాష్ట్రాలకు కన్సల్టెన్సీ సేవలు అందించే స్థాయికి ఎదగాలి. ఇప్పటికే ట్రూ అప్ భారాన్ని ప్రజలపై వేయలేదు, పైగా 13 పైసల మేర ట్రూడౌన్ చేశాం. కొనుగోలు భారాన్ని కూడా తగ్గిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక దానికి పాతరేశారని మండిపడ్డారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నయవంచన చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందన్న డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీఆర్ఎస్ విద్యార్థి నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని కేటీఆర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల సమయంలోనైనా నిధులు విడుదల చేయాల్సిందిపోయి, ప్రశ్నించిన గొంతుకలపై ఉక్కుపాదం మోపడం రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీల అమలు కోసం విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించాల్సిన దుస్థితిని కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలని హితవు పలికారు. విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో 127 మంది విద్యార్థులు మరణించినా ముఖ్యమంత్రిలో కనీస చలనం లేదని, ఇప్పటివరకు దానిపై స్పందించకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బకాయిపడ్డ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలోనైనా నిలబెట్టుకోవాలని సూచించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్వి నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# ఇరాన్ వార్ తో మనకు కష్టాలే

గత దశాబ్ద కాలంలో ఇలాంటి సంక్షోభాల కోసం భారతదేశం తన ముడి చమురు,పెట్రోల్ , డీజిల్ నిల్వలను విస్తరించుకుందని ప్రధాని మోదీ తెలిపారు. నిరంతరాయ సరఫరాను సులభతరం చేయడానికి భారత్ వద్ద పుష్కలమైన ముడి చమురు నిల్వలు ఉన్నాయని ప్రధాని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక నౌకలు హోర్ముజ్ జలసంధిలో చిక్కుకుపోయాయని, వాటిలో పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారని తెలిపారు.౦

ఇది భారతదేశానికి కూడా ఒక ప్రధాన ఆందోళన అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో రాజ్యసభ నుంచి శాంతి సంప్రదింపుల కోసం ఒక ఐక్య స్వరం యావత్ ప్రపంచానికి వినిపించడం అవసరమన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, తాను పశ్చిమ ఆసియాలోని చాలా దేశాల అధినేతలతో రెండు విడతలుగా ఫోన్ సంభాషణలు జరిపినట్లు చెప్పారు. తాము అన్ని గల్ఫ్ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, అలాగే ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాతో కూడా టచ్‌లో ఉన్నామని తెలిపారు.

# నేడు ఎంపీడీవో కార్యాలయం నందు

## సర్పంచులకు సన్మాన కార్యక్రమం

**- మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఆర్.రామాంజనమ్మ.**



**తుగ్గలి:**మండల కేంద్రమైన తుగ్గలిలో గల స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గ్రామ సర్పంచులకు బుధవారం రోజున ఉదయం 11 గంటలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుగ్గలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఆర్.రామాంజనమ్మ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచుల పదవీకాలం మరికొద్ది రోజులలో పూర్తవుతున్న సందర్భంగా వారు నిలిచి గెలిచి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ మండల పరిధిలోని గల 23 గ్రామాల సర్పంచులకు తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్,డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీహరి,మారుతి ప్రసాద్ మరియు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు.కావున ఈ సన్మాన కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని గ్రామాల సర్పంచులు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు తప్పక హాజరు కావాలని ఎంపీపీ రామాంజనమ్మ తెలియజేశారు.

### తుంగభద్ర నదిపై మేలి గనూరు దగ్గర

# వరద కాలువ నిర్మించాలి


**- కుంభలూరు దగ్గర తుంగభద్ర నదిపై ఆగిపోయిన బ్రిడ్జిని నిర్మించాలి**




**కౌతాళం** ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మాట్లాడుతూ మన మండలంలో ఈ సంవత్సరం అధిక వర్షాల వల్ల రైతులు వేసిన పంటలు పత్తి ,మిరప, వేరుశనగ, ఉ ల్లి ,తదితర పంటలు నేలపాలై, రైతులు పెట్టిన పెట్టు బడులురకా ఇతర ప్రాంతాలకు వలసలు ఈ సంవత్సరం పెరిగిపోయినాయని పేర్కొన్నారు.గతంలో మన మండలంలో ఎల్ఎల్సీ నీళ్ళు పుష్కలంగా రైతులకు సాగునీరు అందేది. రైతులు పిల్లాపాపలతో గ్రామాల్లో సంతోషంగా ఉండేవారు కాలానుగుణంగా కాలువ నీరు చివరి ఆయకట్టుకు అందక రైతులు ఆ భూముల్లో వర్షాధార మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారు.కరువు వలసలు నివారణ కొరకు రైతులకు ప్రత్యామ్నాయంగా తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మిస్తే కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కీర్తిశేషులు సుబ్బారాయుడు గతంలో అనేకసార్లు ప్రభుత్వాలు దృష్టికి తీసుకుపోయిన ఈ ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా లేదని వారు అన్నారు. రైతు సంఘం గా అనేకసార్లు ఆందోళనలు, ధర్నాలు ,పాదయాత్రలు చేసి రాజకీయ నాయకులకు, నీటిపారుదల మంత్రులకు, అధికారులకు, ముఖ్యమంత్రులకు చెప్పిన ఈ ప్రభుత్వాలకు చెవికి ఎక్కడం లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం మండల నాయకులు, నియోజకవర్గం ఇన్చార్జిలు, జిల్లా నాయకులు మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని వరద కాలువ నిర్మించి ఈ ప్రాంతంలో వలసలు, కరువు, ఆత్మహత్యలు నివారించి మండల ప్రజలకు సాగునీరు అందించి కాపాడాలని నాయకులకు, అధికారులకు కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి. ఈరన్న రైతు సంఘం మండల నాయకులు హనుమంతు, నారాయణ, కేశవ స్వామి, నరసప్ప, రామలింగా ,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్పివి వ్యాక్సిన్ పై ప్రజలకు అవగాహన...

**- డిప్యూటీ డిఎంహెచ్ఓ రఘురామిరెడ్డి**



**మద్దికేర:** మద్దికేర మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 14 సంవత్సరాలు పూర్తయిన బాలికలకు మరియు వారి కుటుంబ సభ్యులకు డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ రఘురాం రెడ్డి హెచ్పివి వ్యాక్సిన్ పై మంగళవారం రోజున అవగాహన కలిగించారు.అనంతరం మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నుండి రక్షించడానికి హెచ్పివి వ్యాక్సిన్ దోహదపడుతుందన్నారు. అనంతరం వైద్యాధికారుల ఆధ్వర్యంలో బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్ రాగిణి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ,ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీ,విజయ్ కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివపురం గూడెంలో ప్రమాదం



**ఆత్మకూరు** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివపురం గూడెం లో కరెంటు హెల్పర్ షేక్ ఇబ్రహీం కరెంటు లైన్ పోయింది అంటూ కరెంటు పోల్ ఎక్కి లైన్ బిగిస్తుండగా, ఒక్కసారిగా కరెంటు రావడంతో కరెంటు షాక్ తగిలి, ఒకసారి గా కరెంటు పోల్ పైనుంచి మంటలతో కిందికి పడిపోయాడు, అక్కడే ఉన్న చెంచు గిరిజనులు, అతని చూసి, అక్కడ ఎటువంటి వాహనాలు, లేకపోవడంతో వెంటనే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు, 108 కు ఫోన్ చేసి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి, తీసుకువెళ్లారు

# జల్ జీవన్ మిషన్ 2.0

## - కేంద్రంతో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ...

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ (జేజేఎం) 2.0' అమలు కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 'హర్ ఘర్ జల్' (ప్రతి ఇంటికి కుళాయి నీరు) లక్ష్యాన్ని సాకారం చేసేలా కేంద్రం, ఏపీ మధ్య ఈ ఒప్పందం జరిగింది. ఢిల్లీలోని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు.ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరుకాగా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ ద్వారా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అశోక్ కుమార్ మీనా, ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. జల్ జీవన్ మిషన్‌ను 2028 వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రతి ఇంటికి సురక్షితమైన, స్థిరమైన తాగునీటిని అందించాలనేది మా ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇది కూడా ఒకటి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు" అని అన్నారు. ఇదే సమయంలో, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు.కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వర్చువల్‌గా మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జేజేఎం 2.0కు అనుమతి ఇచ్చామని తెలిపారు.

"ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై ప్రధాని మోదీతో సంప్రదించారు. ఈ మిషన్ పొడిగింపు కోసం ఆయన చేసిన ప్రతిపాదనకు ధన్యవాదాలు. మొదటి దశలో 16 కోట్ల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. మిగిలిన 3 కోట్ల ఇళ్లకు సురక్షిత నీటిని అందించాల్సి ఉంది" అని ఆయన వివరించారు. ఏపీలో నీటి నాణ్యతను పరీక్షించేందుకు డ్వాక్రా మహిళల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ తాజా ఎంఓయూతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు ఏపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించనుంది. త్వరలోనే ఏపీలోని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసి, ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించుకుందామని కేంద్ర మంత్రి పాటిల్ తెలిపారు. జల్ జీవన్ మిషన్ విజయవంతానికి కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, దీనిని ఏపీ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2047 నాటి 'వికసిత భారత్' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు చేరడం అత్యంత కీలకమని ఆయన నొక్కిచెప్పారు

## చెట్లు కాపాడండి, ప్రకృతిని రక్షించండి.



మండల పరిధిలోని నేరణికి గ్రామంలో మంగళవారం చెట్లు కాపాడండి ప్రకృతిని రక్షించండి అనే నినాదంతో ఆలూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కళాజాత బృందం వివిధ మ్యాజిక్ షో ల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అడవి మరియు కొండ ప్రాంతాలకు నిప్పు పెట్టకూడదని అలాగే చెట్లు నరికి పర్యావరణాన్ని కలుషితం చేయవద్దని తెలియజేశారు.ప్రకృతి మనిషి జీవనానికి ఆధారం.కానీ చెట్లను విపరీతంగా నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది.అడవులు తగ్గిపోవడం,గాలి కాలుష్యం పెరగడం,వాతావరణ మార్పులు వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి.పర్యావరణాన్ని కాపాడాలంటే చెట్లను నరికి వేయడం తగ్గించి,మరిన్ని మొక్కలు నాటడం అవసరమన్నారు.ప్రతి ఒక్కరూ ప్రకృతిని సంరక్షించే బాధ్యత తీసుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమన్నారు. ఈ కార్యక్రమంలో నేరణికి వెస్ట్ ఇంచార్జ్ బిట్ ఆఫీసర్ విమల్ కుమార్,నేరణికి ఈస్ట్ బిట్ ఆఫీసర్ బాలకృష్ణ, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్ప,టీడీపీ జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ మల్లికార్జున,గిరప్ప,పోస్ట్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామనవమి సందర్భంగా తుగ్గలి లో

## దేశపు ఎద్దుల రాతి దూలము పోటీలు



**తుగ్గలి:** శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రమైన తుగ్గలి లో ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి ల సహాయ సహకారాలతో 28వ తేదీ శనివారం రోజున గ్రామ పెద్దల సమక్షంలో దేశపు ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి తుగ్గలి నాగేంద్ర 30000, రెండవ బహుమతి బెస్త ఐస్ మల్లయ్య 25000,మూడవ బహుమతి గుత్తి ఎస్సై సురేష్ 20000, నాలుగవ బహుమతి బెస్త పరుశురాం 15000, ఐదవ బహుమతి శ్రీఆంజనేయులు 10000, ఆరవ బహుమతి తుగ్గలి ట్రాక్టర్ యూనియన్ 5000 రూపాయల నగదు బహుమతులను అందజేయనున్నారు.ఆసక్తిగల వృషభ యజమానులు 28వ తేదీ ఉదయం 8 గంటల లోపు 9959491416, 9603310110 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు.

## భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత

**న్యూఢిల్లీ** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న మనవారిని సురక్షితంగా తీసుకువచ్చామని తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులపై ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ, పశ్చిమాసియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు.అక్కడ యుద్ధం జరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు వస్తున్నాయని, ఇంధన సంక్షోభానికి దారితీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ముడి చమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం మనకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, హర్మూజ్ జలసంధి మీదుగా భారత చమురు నౌకలు వస్తున్నాయని వెల్లడించారు.ఆ నౌకలు సురక్షితంగా మన పోర్టులకు చేరేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అక్కడి నుంచి 3.54 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చామని అన్నారు. ఈ దాడుల్లో కొంతమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారని సభకు తెలిపారు. గల్ఫ్ దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సమస్యలకు చర్చలు, సంప్రదింపులే ఏకైక పరిష్కారమని ప్రధాని మోదీ అన్నారు.

## తప్పుడు కేసులు పెరుగుతున్నాయి

**న్యూఢిల్లీ** దేశవ్యాప్తంగా క్రిమినల్ న్యాయ వ్యవస్థలో పెరుగుతున్న తప్పుడు ఫిర్యాదులు, కల్పిత ఆరోపణలు, నకిలీ సాక్ష్యాల సమస్యపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం.. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసులో తదుపరి విచారణ మే 11న జరిగే అవకాశం ఉంది.భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), 2023లోని సెక్షన్లు 215, 379లను ఉన్నది ఉన్నట్లుగా అన్వయించడం వల్ల పలు శిక్షాస్మృతి నిబంధనలు నీరుగారిపోతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్లను తప్పుడు ఎఫ్ఐఆర్‌లతో, కోర్టులను తప్పుడు కేసులతో ముంచెత్తుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం తప్పుడు కేసుల బాధితులు నేరుగా న్యాయపోరాటం చేసేందుకు కోర్టు నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి కావడం, జవాబుదారీతనానికి ఇది అడ్డంకిగా మారిందని పిటిషనర్ వాదించారు.తప్పుడు కేసుల బెదిరింపుల వల్ల అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో ఒక కుటుంబం తప్పుడు కేసుల బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, తప్పుడు కేసుల బాధితులు నేరుగా కోర్టు అనుమతితో ఫిర్యాదు చేసేలా బీఎన్ఎస్ఎస్ చట్టంలోని నిబంధనలకు సరైన భాష్యం చెప్పాలని పిటిషనర్ కోరారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని, అమాయక పౌరులను కాపాడేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## క్రైస్తవంలో మారితే ఎస్సీ హోదా రద్దు

**న్యూఢిల్లీ,** ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి, దానిని చురుకుగా ఆచరిస్తే, అతను షెడ్యూల్డ్ కుల సమాజంలో సభ్యుడిగా కొనసాగలేడని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును సుప్రీంకోర్టు సమర్థించింది. హిందూమతం, సిక్కు మతం లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతాన్ని ఆచరించే ఏ వ్యక్తిని షెడ్యూల్డ్ కుల సభ్యునిగా పరిగణించలేమని సుప్రీం కోర్టు పేర్కొంది. మాత మార్పిడిలపై మంగళవారం సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. మరో మతంలోకి మారడం వల్ల షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులో స్పష్టం చేశారని, ఈ ఉత్తర్వు కింద విధించిన నిషేధం సంపూర్ణమైనదని కోర్టు పేర్కొంది. 1950 నాటి ఉత్తర్వులోని సెక్షన్ 3లో పేర్కొనని ఏ మతంలోకి మారినా, పుట్టుకతో సంబంధం లేకుండా తక్షణమే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని కోర్టు స్పష్టం చేసింది.సెక్షన్ 3 ప్రకారం షెడ్యూల్డ్ కులానికి చెందిన సభ్యునిగా పరిగణించని వ్యక్తి, రాజ్యాంగం లేదా మరే ఇతర చట్టం కింద ఎలాంటి చట్టబద్ధమైన ప్రయోజనం, రక్షణ, రిజర్వేషన్ లేదా హక్కును పొందలేరని లేదా క్లెయిమ్ చేయలేరని కోర్టు తీర్పు ఇచ్చింది.షెడ్యూల్డ్ కులం లేదా షెడ్యూల్డ్ తెగ సభ్యునిగా గుర్తింపు పొందాలంటే, ఒక వ్యక్తి రాజ్యాంగం ప్రకారం ప్రత్యేకంగా నోటిఫై చేయబడి, గుర్తించిన అటువంటి కులం లేదా తెగకు తాను చెందినవాడినని స్పష్టంగా నిరూపించుకోవాలి.క్రైస్తవ మతంలోకి మారి, పాస్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి తనపై దాడి చేశారని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులపై షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టం కింద కేసు దాఖలు చేసిన కేసులో ఈ ఉత్తర్వు జారీ అయ్యింది. అతను ఎస్సీ,ఎస్టీ చట్టం కింద రక్షణ కోరగా, ఆ పాస్టర్ మతం మారి క్రైస్తవ మతాన్ని చురుకుగా ఆచరిస్తున్నందున ఆ చట్టం చెల్లదని నిందితులు సవాలు చేశారు.ఏప్రిల్ 30, 2025 నాటి ఉత్తర్వు ద్వారా కుల వ్యవస్థ క్రైస్తవ మతానికి విరుద్ధమైనదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పేర్కొంది. అందువల్ల అటువంటి వ్యక్తులకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టంలోని నిబంధనల ప్రయోజనాలు నిరాకరించింది. క్రైస్తవ మతంలోకి మారి, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని ప్రయోగించిన ఫిర్యాదిదారు దాఖలు చేసిన ఆరోపణలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ ఎన్. కొట్టివేశారు

## జాబ్ క్యాలెండర్ పై షర్మిళ తీవ్ర విమర్శలు

**విజయవాడ,** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాడు విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ క్యాలెండర్ ఉందని, ఇది యువతను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచారని అన్నారురాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం యువతకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ చూసి అంతా తుస్సుమనిపించిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వాస్తవ ఖాళీలు ఎన్ని, వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. దీంతోపాటు, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కూడా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

**షర్మిళపై రాచమల్ల ఫైర్** వైసీపీ అధినేత జగన్ ను టార్గెట్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల చేస్తున్న విమర్శలపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నిప్పులు చెరిగారు. వివేకానంద రెడ్డి మరణం తర్వాత అది 'గుండెపోటు' అని ప్రచారం చేయడంలో జగన్ హస్తం ఉందన్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.వివేకా మరణించిన సమయంలో అది గుండెపోటు అని కేవలం సాక్షిలోనే కాదు, 'ఎల్లో మీడియా'లో కూడా వార్తలు వచ్చాయని రాచమల్లు గుర్తు చేశారు. ఎల్లో మీడియా గురించి షర్మిల ఎందుకు మాట్లాడటం లేదని ఆయన నిలదీశారు. వివేకా మరణం గురించి ఆయన బావమరిది శివప్రకాశ్ రెడ్డి అందరికీ ఫోన్ చేసి చెప్పారని, ఆ తర్వాతే మీడియాలో వార్తలు వచ్చాయని వివరించారు.సంస్కారం, కుటుంబ గౌరవం కోసమే జగన్ ఇప్పటికీ ఈ అంశాలపై మౌనంగా ఉన్నారని, అది ఆయన చేతకానితనం కాదని రాచమల్లు పేర్కొన్నారు. దమ్ము, ధైర్యానికి కేరాఫ్ అడ్రస్ జగన్ అని ఆయన కొనియాడారు. తప్పుడు విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని, వాస్తవాలను గ్రహించాలని షర్మిలకు హితవు పలికారు.

## అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం. రూ 2 లక్షల ఆస్తి నష్టం.

**రుద్రవరం.** మండలంలోని హరినగరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో గుడిసె దట్టమయింది. గ్రామస్తుల వివరాల మేరకుగ్రామానికి చెందిన భేతి కనకమ్మ ఇంటిలో తెల్లవారుజామున హఠాత్తుగా మంటలు వ్యాపించి గుడిసెపూర్తిగ దగ్ధమైందన్నారు. ఈ ప్రమాదంలో వంట సామాగ్రి, దుస్తులు, ధాన్యం, టీవీ, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి అన్నారు.

ప్రమాదంలో దాదాపు 2 లక్షల దాకా నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇంటిలో మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు సకాలంలో స్పందించి మంటలను ఆర్పి వేశారు. కాలిన గుడిసెను విఆర్ఓ పుల్లయ్య పరిశీలించారు. నష్టం వివరాలను నివేదిక గా తయారుచేసిరెవెన్యూ అధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

# కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా
# చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు ఇవ్వరా అంటున్న కాంటాక్టర్లు
- ఆస్తులు అమ్మి, బంగారం కూదవ పెట్టి, అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు ఇవ్వడంలో జాప్యం ఎందుకు
- ప్రజా ప్రభుత్వంలో ప్రజల కోసం పనిచేసే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వరా.?
- ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క 20% కమిషన్ ఇస్తేనే బిల్లు ఇస్తాం అంటున్న ఆర్థిక శాఖ
- జీవో 94 ను ఇంప్లిమెంట్ చేయని అధికారులు పట్టించుకోని ఉన్నతాధికారులు ఇంజనీరింగ్ అధికారులు చదువుకున్నారా.? లేక సర్టిఫికెట్ కొనుకున్నారా.?

అన్న అనుమానం సంగిశెట్టి రవీందర్ సాగర్








**(గంగి కృష్ణ- ప్రశ్న న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఆర్థిక శాఖ అంటున్న కాంట్రాక్టర్ గౌని సైదులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ గౌని సైదులు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంజనీరింగ్ సంస్థలలో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు సంవత్సరాల కొద్దీ బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఆర్థిక శాఖ 20% కమిషన్ కోసం ఇబ్బంది పెడుతున్నారు అంటూ ఆయన తెలిపారు. అప్పులు తెచ్చి, నగలు కుదువ పెట్టి, ఆస్తులు అమ్మి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తూ వాళ్ల బతుకు చిన్న బిన్నం అయ్యేలా ప్రభుత్వం, అధికారులు చేస్తున్నారంటూ ఆయన తెలిపారు. ఒక పనిని టెండర్లో తీసుకొని పని పూర్తి చేసి బిల్లు తీసుకోవాలంటే అధికారులకు 15%, ఆర్థిక శాఖకు 20% లంచాలు ఇస్తే నాణ్యత ఎక్కడ ఉంటుంది అందులో మిగులుబడి ఎంతఅని, అన్ని కోణాలలో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలని ప్రభుత్వం మాకు ఇచ్చే రేటులో బయట దొరికే మెటీరియల్ రేట్లలో 15 నుంచి 20 శాతం వరకే మాకు మిగులుబడి ఉంటుందని అది కూడా అధికారులు, ఆర్థిక శాఖ తీసుకుంటే మాకు మిగులుబడి ఎక్కడ ఉంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వ్యాపారి వ్యాపారం చేస్తే మిగులుబడి చూస్తాడు తప్ప లోటులో పనిచేయాలని ఏ వ్యాపారి కూడా అనుకోడని, అలా అయితే ఏ వ్యాపారం కూడా నిలవదని అందుకే రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు ఆలోచిస్తున్నారని అధికారులు ఆర్థిక శాఖ ఈ రెండు వ్యవస్థలలో మార్పు రాకుంటే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో వాళ్ళ బతుకులు చిన్నాభిన్నమే కావడం కాకుండా అభివృద్ధి పనులు కుంటుపడతాయని,



PD A/C Cheque
RBI Ekuber Branch: STO Ghatkesar(Uppal)
GOVERNMENT OF TELANGANA
TREASURY DEPARTMENT
26-05-2025
GANGI KRISHNA
Rupees SEVEN LAKH SEVENTY THOUSAND ONE HUNDRED TWENTY SEVEN ONLY
₹ 7,70,127.00
A/c No. 20320151297
Chargeable against Head of Account: 8448001020006002000NVN
Treasury Code 2102
DDO Code 21021806002
Prefix:
COMMISSIONER
Boduppal Municipal Corporation
*Digital Cheque
|' 2600425909 |'

జిహెచ్ఎంసి లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు ఆరు నెలలు 9 నెలలు సంవత్సరం కూడా కాలం గడుస్తుందని, జిహెచ్ఎంసి లో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఒకే రీతిలో వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్కు ఇచ్చే బిల్లును బ్యాంకుతో అనుసంధానం చేసి మాకు ఇచ్చే డబ్బులని బ్యాంకుతో లింకు చేసి లోన్ రూపంలో ఇస్తూ అక్కడ బ్యాంకుకు వడ్డీ కట్టడం, మున్సిపాలిటీలలో పనులకు ఆర్థిక శాఖకు, అధికారులకు ఇంత మొత్తంలో పోతే ఏ మొత్తంలో మిగులుతుందని ఒక్కసారి ఇంజనీరింగ్ శాఖ నిపుణులు అంటున్నారని ఆయన అన్నారు.

### బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేసిన కాంట్రాక్టర్ కు బిల్లు రాక ఇబ్బందులు

ఈ ప్రొక్యూర్మెంట్ లో పాల్గొని టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గంగి కృష్ణ 20 లక్షల పనిని పూర్తి చేయడం జరిగిందని అందులో 15.7 లక్షలు రికార్డు కాగా 8 లక్షల రూపాయలు బ్యాంకు చెక్కు ఇచ్చారని, ఇంకా 7.5 డబ్బులు లేవంటూ ఎస్ టి ఓ చెక్కు గత సంవత్సరం 26-5-2025, రూ. 7.70 తేదీనాడు చెక్కు ఇవ్వగా ఆ మరుసటి రోజు ఎస్ టి ఓ ఆఫీస్ లో చెక్కు సమర్పించగా ఇప్పటివరకు చెక్కు పాస్ కాలేదు అంటూ ఆర్థిక శాఖలో 20% డబ్బులు ఇస్తేనే బిల్లు పాస్ అవుతుందని, 20% డబ్బులు ఇవ్వలేక ఆవేదన చెందుతున్న కాంట్రాక్టర్ గంగి కృష్ణ అని ఆయన అన్నారు.

### బిల్లులపై అధికారుల కమిషన్లు లంచాలు:


బిల్లులు ఇచ్చే పద్ధతిలో లంచాల వివరాలు : రాష్ట్రంలో ప్రతి సంస్థలు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కాంట్రాక్టర్ టెండర్ లో పని తీసుకొని పని పూర్తి చేసిన తర్వాత అసిస్టెంట్ ఇంజనీర్ కు 3%, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు 2%, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు 2%, డిప్యూటీ కమిషనర్ కు 1%, జోనల్ కమిషనర్ కు 1%, క్వాలిటీ కంట్రోల్ కు 0.5%, ఆడిట్ సెక్షన్కు 0.5%, అకౌంట్ సెక్షన్ 0.5%, బడ్జెట్ స్టిక్కరింగ్ సెక్షన్కు 0.5% ఇలా సుమారు 15% వరకు అధికారులు లంచాల రూపంలో తీసుకుంటే కాంట్రాక్టర్లకు మిగిలేది ఎంత అని ఇంజనీరింగ్ శాఖ నిపుణులు అంటున్నారని తెలిపారు.

### ప్రభుత్వ సంస్థలో పనిచేసిన కాంట్రాక్టర్ల ఆవేదన :

అప్పులు తెచ్చి, నగలు కుదువ పెట్టి, ఆస్తులు అమ్మి తెచ్చిన డబ్బులు అభివృద్ధి పనుల చేస్తే బిల్లులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెట్టడం, ఆర్థిక శాఖ నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం, మెటీరియల్ తెచ్చుకున్న సంస్థల వ్యక్తుల వద్ద మాట పోవడం ఇన్ని ఇబ్బందుల మధ్యన కాంట్రాక్టర్ కుటుంబంలో జరిగే శుభకార్యాలు, అశుభ కార్యాలకు చిన్న చిన్న శుభకార్యాలకు ఇబ్బందులు పడుతూ అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు ఇవ్వకపోవడంతో గతంలో ఎంతోమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, హార్ట్ ఎటాక్ వచ్చి మరణించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయని ఇవన్నీ పరిగణంలోకి తీసుకొని బిల్లును త్వరగా ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టి కాంట్రాక్టర్లకు బిల్లులు త్వరగా ఇచ్చినట్లయితే మన రాష్ట్రం మన దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని లేకుంటే అభివృద్ధి కుంటుపడుతుందని, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడం ఇది ఎంతవరకు సమంజసమని మేధావులు ఆర్థిక నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి రవీందర్ సాగర్ వివరణ: సంగిశెట్టి రవీంద్ర సాగర్ వివరణ కోరగా ప్రభుత్వం అభివృద్ధి చేసే కాంట్రాక్టర్ల పట్ల వివక్ష చూపుతున్నారని కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించాలని చెల్లించకుంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడుతూ అక్రమంగా ముడుపులు తీసుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొంతమంది ఇంజనీరింగ్ అధికారులకు 94 జీవో పూర్తి స్థాయిలో ఇంప్లిమెంటేషన్ చేయడం లేదంటూ ఆయన తెలిపారు. ఉదాహరణకు: 94 జీవోలోని పేజి నెంబర్ 7లో క్రమసంఖ్య 5 లో ఉన్నటువంటి ఈఎండి కి సంబంధించిన విషయంలో ఎస్టిమేట్ కాంట్రాక్ట్ వ్యాల్యూ, కాంట్రాక్టు వ్యాల్యూవుకు తేడా లేకుండా కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడుతూ అగ్రిమెంట్ సమయంలో నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని

## పూజకు నోచుకోని పెద్దమ్మ తల్లి ఆలయం

### -పెద్దమ్మతల్లి ఆలయం శిథిలావస్థకు గురవుతుందని స్థానికుల వేదన



జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్)జవహర్ నగర్ వ్యవస్థాపకులు కారింగుల నర్సింగరావు గౌడ్ చంద్రపురి కాలనీలో పెద్దమ్మ గుడి కోసం మూడు వందల ఇరవై గజాల స్థలాన్ని కేటాయించి ఆలయ నిర్మాణం పనులు చేపట్టి ఇరవై ఆరు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పెద్దమ్మ గుడి పూజకు నోచుకోని దౌర్భాగ్య స్థితి నెలకొనడం ఎంతో బాధాకరమని స్థానికులు విన్నవిస్తున్నారు. పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం గతంలో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఎన్నికల సమయంలో బోర్ వేయించి రెండు లక్షల నగదును అందజేయడం జరిగిందని అలాగే చామకూర మల్లారెడ్డి మల్కాజ్గిరి మెంబర్ అఫ్ పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికల సందర్భంగా రెండు లక్షల నగదును అందజేయడం జరిగిందని మొదటిసారి మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు గా ఎన్నికల బరిలో నిలిచిన చామకూర మల్లారెడ్డి మూడు లక్షల నగదును అమ్మవారి ఆలయం కోసం అందజేయడం జరిగిందని మళ్లీ గత ఎన్నికల్లో చామకూర మల్లారెడ్డి ఎన్నికల సమయంలో మూడు లక్షల నగదును అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం అందజేయడం జరిగిందని అయినప్పటికీ స్థానికులుగా ఉన్న పెద్దలు పెద్దమ్మ దేవాలయ నిర్మాణం పనులు పూర్తి చేసి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన గావించి స్థానికులతో పాటు జవహర్ నగర్ ప్రజలందరికీ అమ్మవారిని దర్శించుకునే భాగ్యాన్ని సమకూర్చాలనే స్ఫూర్తి స్థానికుల్లో ఏమాత్రం లేకపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో అరవై గజాల విస్తీర్ణం కలిగి ఉన్న స్థలాల్లో నిర్మించిన దేవస్థానాలలో దేవత మూర్తులు పూజలు అందుకుంటుంటే మూడు వందల ఇరవై గజాల విస్తీర్ణం కలిగిన ఉన్న పెద్దమ్మతల్లి దేవస్థాన ప్రాంగణం ఇరవై ఆరు సంవత్సరాల నుండి పూజకు పనికిరాని పుష్పం మాదిరిగా విగ్రహ ప్రతిష్టకు నోచుకోక దేవాలయం శిథిలావస్థకు చేరువవడం ఎంతో చింతించదగ్గ విషయమని స్థానికులు మనసులో మాటలను వెలబుచ్చుతున్నారు. ఇప్పటికైనా పెద్దమ్మతల్లి దీవెనలతో పెద్ద మనుషులుగా చెలమానవుతున్న పెద్దలు తక్షణమే పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన గావించి ఆలయ అభివృద్ధికి కృషిచేసి అమ్మవారి దివ్యదర్శన భాగ్యం స్థానికులతో పాటు జవహర్ నగర్ ప్రజలందరికీ కలిగించేలా శ్రద్ధతో ముందుకు సాగాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

## అటవీ రక్షణ అందరి బాధ్యత



**నార్నూర్,** అటవీ సంపదను సంరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఎస్ఆర్ఆ షీలానంద్, ఎఫ్ఎస్ఓ జాదవ్ గోపాల్ పేర్కొన్నారు. నార్నూర్ మండలంలోని హస్నాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో పూసిగూడ శివారులో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. చెట్లు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని అధికారులు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పెంపకంపై శ్రద్ధ వహించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. అటవీ సంపదను కాపాడితేనే భవిష్యత్ తరాలకు శుభ్రమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ నితిన్ కుమార్, సర్పంచ్ చత్రు శావ్, ఉపసర్పంచ్ జనాబాయి, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ఉపాధి కీలకం

### - సబ్ కలెక్టర్ ఉమాహారతి




**సంగారెడ్డి** మహిళ సాధికారతకు ఉపాధి ఎంతో కీలకం అని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్ ఉమా హారతి అన్నారు, మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని లలిత కుమారి, ప్రాజెక్టు సిడిపిఓ సుజాత ,జిల్లా మహిళ సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, బాలసదనం సూపర్డెంట్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీపై ప్రజలు అవగాహన పెంపొందించాలి

### - జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల** ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ సిబ్బందికి అలాగే ప్రజలకు క్రమంగా క్షయ వ్యాధి టిబి పరీక్షలు నిర్వహించి, డయాలసిస్ చేయాల్సిందిగా వైద్య అధికారులకు సూచించారు. క్షయవ్యాధి పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, సమయానికి పరీక్షలు చేయించుకొని సరైన చికిత్స తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని ఆయన పేర్కొన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలను పాటించడం ద్వారా వ్యాధిని త్వరగా నియంత్రించవచ్చని అన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో అవగాహన పెంపొందించడమేనని తెలిపారు. లక్షణాలు, నివారణ చర్యలు, ఉచిత పరీక్షలు, చికిత్సపై వైద్య అధికారులు ప్రజలకు వివరించారు. అలాగే ప్రజలకు క్షయ వ్యాధి పట్ల పూర్తి స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలకు సందేశాన్ని చేరవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా వైద్యాధికారి సుజాత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు ఇవ్వండి.. లేదా అద్దె చెల్లించండి

### - రేణిగుంట తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా....



**రేణిగుంట** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు ఇంటి నిర్మాణం కై ఐదు లక్షల రూపాయలు రుణాలు ఇవ్వాలని లేని పక్షంలో ఇంటి స్థలం ఇచ్చేంతవరకు బాడుగదారులకు ఇంటి బాడుగ ప్రభుత్వమే చెల్లించాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రేణిగుంట తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి వై యస్ మణి అధ్యక్షతన ధర్నా కార్యక్రమం జరిగినది ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు డి రజాక్ వి కార్తీక్ మరియు భాను తరుణ్ దాము తదితరులు పాల్గొన్నారు

# రణవీర్ సింగ్ విశ్వరూపం..

## రికార్డులను తుడిచిపెడుతున్న 'ధురంధర్'




బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది.ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్-2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం.తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. సాక్‌నిల్క్ (ఝుఏఅఅశ్రీఎ) రిపోర్ట్ ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయ సినిమా చరిత్రలో టాప్-5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

# 'గోట్' వాయిదా ..'బ్యాండ్ మేళం' సహా పలు చిత్రాలు సందడికి సిద్ధం



ఉగాది కానుకగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ 2 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విభిన్న ఫలితాలను అందుకున్నాయి. ఒకటి భారీ విజయాన్ని సాధిస్తే, మరొకటి ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మరికొన్ని సినిమాలు థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నాయి. అయితే ఈ రేసులో ఉండాల్సిన 'గోట్' సినిమా వాయిదా పడటం చర్చనీయాంశం అయింది. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించిన గోట్ చిత్రాన్ని దర్శకుడు వేదవ్యాస్ తెరకెక్కించగా, ఎమ్ చంద్రశేఖర్ నిర్మించారు. చాలా కాలంగా షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా, డైరెక్టర్ నరేష్ కుప్పిలి మరియు నిర్మాతల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా ఆలస్యమైంది.అన్ని అడ్డంకులను దాటుకుని మార్చి 26న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం, ఇప్పుడు పోస్ట్-ప్రొడక్షన్ దశలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా వాయిదా పడింది. బెటర్ క్వాలిటీతో సినిమాను అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని మేకర్స్ తెలిపారు. ఏప్రిల్ 6న ట్రైలర్ విడుదల చేసి, అదే రోజు కొత్త రిలీజ్ డేట్ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఇక బ్యాండ్ మేళం చిత్రం మాత్రం శ్రీరామనవమి సందర్భంగా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన ఈ సినిమాను సతీశ్ జవ్వాజీ దర్శకత్వంలో కోన వెంకట్ నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి ట్రైలర్ లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేయడం సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది.మరోవైపు సంగీత దర్శకుడు-నటుడు జీవీ ప్రకాశ్ కుమార్, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన హ్యాపీ రాజ్ చిత్రం మార్చి 27న విడుదల కానుంది. మరియా రాజా ఎలాంచెళియన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో 'ప్రేమదేశం' ఫేమ్ అబ్బాస్ రీఎంట్రీ ఇవ్వడం విశేషం.ఇక ప్రియదర్శి, ద్రిషిక చందర్ జంటగా నటించిన సుయోధన చిత్రం సైకాలజికల్ థ్రిల్లర్‌గా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. మాధవ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో సాయికుమార్, ప్రేమ కీలక పాత్రలు పోషించారు. అదేవిధంగా, తమిళ నటుడు కరుణాస్ కుమారుడు కెన్ కరుణాస్ దర్శకత్వంలో రూపొందిన 'యూత్' అనే తమిళ్ డబ్బింగ్ మూవీ మార్చి 26న తెలుగులో విడుదల కానుంది. దేవదర్శిని, సురాజ్ వెంజరమూడు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

# శ్రీలీలకు వరుస ఫ్లాపులు

?



టాలీవుడ్‌లో సెన్సేషనల్ డెబ్యూతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రీలీల, చాలా తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది.'భగవంత్ కేసరి' వంటి కొన్ని సినిమాలు మినహా, ఆమె నటించిన చాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం కూడా సినిమాకు హైప్‌ను తీసుకువచ్చింది. అయితే, సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగిటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సినిమా ప్రదర్శన సంతృప్తికరంగా లేకపోవడం చిత్రబృందానికి నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ సినిమాలో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. క్యారెక్టర్ డిజైన్ సరైన స్థాయిలో లేకపోవడం, పెర్ఫార్మెన్స్‌కు పెద్దగా స్కోప్ లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకున్న శ్రీలీల, ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇక, వరుస పరాజయాలు వచ్చినప్పటికీ, శ్రీలీల తన రెమ్యూనరేషన్ తగ్గించలేదన్న వార్తలు కూడా పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీనితో పలువురు నిర్మాతలు ఇతర హీరోయిన్లను ఎంపిక చేసుకునే దిశగా మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా క్రేజీ ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో, శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్రసీమలో ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం. టాలీవుడ్‌లో తిరిగి తన స్థానాన్ని సంపాదించుకోవడానికి ఆమె ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# పెద్దితో చిందేయనుందా?



మృణాల్ ఠాకూర్ తెలుగులో మూడు సినిమాలు చేస్తే, వాటిలో రెండు విజయాలను అందుకున్నాయి. త్వరలో ఆమె 'డెకాయిట్' సినిమాతో మరోసారి తెలుగుప్రేక్షకుల్ని పలకరించనున్నది. రిలీజ్‌కు ముందే ఈ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. ఇందులో మృణాల్ పాత్ర కూడా సామాన్యంగా ఉండదట. బలమైన భావోద్వేగాలతో ఆమె పాత్రను తీర్చిదిద్దారట దర్శకుడు షానియల్ డియో. ఈ పాత్రతో ఆమె కెరీర్ మలుపు తిరగడం ఖాయమని ఇన్‌సైడ్ టాక్. ఇక బన్నీ, అట్లీ సినిమాల్లోనూ మృణాల్ నటిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇదిలావుంటే.. తాజా సమాచారం ప్రకారం రామ్‌చరణ్ 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట మృణాల్ ఠాకూర్. ఈ పాటలో జాన్వీ కపూర్ కూడా భాగం కానున్నదట. సినిమాకే ఈ పాట హైలైట్ అట. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది.

# సుస్వరాల అరెరే.. అరెరే..



నటి, గాయని దియా అందించిన మ్యూజిక్ వీడియో ఆల్బమ్ 'అరెరే.. అరెరే..'. బటర్‌ఫ్లై మ్యూజిక్ బ్యానర్‌పై రూపొందిన ఈ మ్యూజిక్ వీడియో విడుదల వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, హీరో పూరి ఆకాష్, సమీర్, సాగర్, రఘు కుంచె, శివారెడ్డి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి మేకర్స్‌కి శుభాకాంక్షలు అందించారు. మా టీమ్ సమిష్టి కృషి వల్లే ఈ ఆల్బమ్ ఇంతబాగా వచ్చిందని, ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ ఈ ఆల్బమ్‌కి ఉంటాయని నమ్ముతున్నామని నటి, గాయని దియా నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత నూతన్ చెకురి, దర్శకుడు క్రాంతివర్మ, సంగీత దర్శకుడు శరవణ వాసుదేవన్ కూడా మాట్లాడారు. త్వరలో విడుదల కానున్న ఈ మ్యూజిక్ వీడియోకు కెమెరా: చందు ఏజే.

# అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది



# విద్యారంగంపై ప్రభుత్వాల వైఫల్యం

**ఏ.ఐ.ఎస్.బి. రాష్ట్ర నేత : అతికం రాజశేఖర్ గౌడ్ ఆగ్రహం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐఎస్‌బి రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులు, యువతకు అనేక హామీలు ఇచ్చినప్పటికీ, వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆయన అన్నారు.రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని ఆయన ఆరోపించారు. అదే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా కార్పొరేట్ ప్రైవేట్ యూనివర్సిటీలకు ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.యూనివర్సిటీలలో పీహెచ్‌డీ చేస్తున్న రీసెర్చ్ స్కాలర్లకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు మెట్టు రాకేష్, సార్ల సతీష్, రాజేష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విలాసాగర్‌లో ఉపాధి హామీ పనులకు శ్రీకారం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉప సర్పంచ్ పోత్తూరి శైలజ సంయుక్తంగా చెరువు వద్ద పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు జోగు శంకర్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొని పనుల ప్రారంభానికి నాంది పలికారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ, రాబోయే ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కార్మికులు ఉదయం వేళల్లోనే పనులు ప్రారంభించి, ఎండ పెరిగేలోపే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. అలాగే ప్రతి కార్మికుడు తగినంత తాగునీరు వెంట తీసుకెళ్లి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విలాసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర కనకరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణ పోలీస్ ఠాణాను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



వేములవాడ (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. కేసుల రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవస్థను పటిష్టంగా అమలు చేసి ప్రజలకు చేరువ కావాలని, ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని సూచించారు. డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించడంతో పాటు రౌడీ షీటర్లపై కఠిన నిఘా ఉంచాలని తెలిపారు.నేరాల నివారణకు సీసీటీవీలు పెంచాలని, "అరివ్ అలైవ్ "లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**- అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు**

**- ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ.**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ - స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార--పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు.అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# మండి బిర్యానీ వికటించి నలుగురికి అస్వస్థత

**ఏఎస్ రావు నగర్‌లో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి**














కాప్రా(ప్రశ్నన్యూస్) కుషాయిగూడలోని ఏఎస్ రావు నగర్‌లో ఉన్న 'డిలీషియస్ మండి' హోటల్‌లో బిర్యానీ తిని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన గత మూడు రోజుల క్రితం జరగగా, బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.?బాధితుల వివరాల ప్రకారంస్థానిక నివాసితులైన ఉమేష్, రాధిక, నరసింహ మరియు నాలుగు సంవత్సరాల బాలుడు విహాల్ కలిసి సదరు హోటల్‌లో మండి బిర్యానీ తిన్నారు. తిన్న కొద్దిసేపటికే వారందరికీ వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. పరిస్థితి విషమించడంతో వెంటనే వారిని జమ్మిగడ్డలోని ఒక ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు.?తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్ కారణంగా బాధితులు గత మూడు రోజులుగా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. చిన్నారి విహాల్ పరిస్థితిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే నాసిరకం, కాలం చెల్లిన ఆహారం వడ్డించారని, అందుకే తమకు ఈ పరిస్థితి ఎదురైందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఆహార భద్రతా అధికారులు (ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్) స్పందించి సదరు హోటల్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కలెక్టర్ సార్ మాకు న్యాయం చేయండి

**- బాధితురాలు కమ్మరి రాజమణి**

**- నా గోస ఎవరు వింటలేరు సార్ -నాకు చావడమే శరణ్యమ.? అని బాధితురాలి ఆవేదన**

**- కబ్జా కోరులకు బలవుతున్న పేదల ఇళ్ల పట్టాలు**





ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన రాజమణి అనే మహిళకు అప్పట్లో అంటే 2002 సంవత్సరంలో ప్రభుత్వం నీలువ నీడలే ని వారికి ఇల్ల పట్టాలిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వం పట్టాలు కొందరికి ఇచ్చారు.కానీ ఏమాత్రం డబ్బులు లేకపోవడం వలన ఎలాంటి నిర్మాణాలు చేయలేదు ఇప్పుడు ఇల్లు కట్టుకుందాం అంటే అక్కడ నా ప్లాట్ అని వేరే వారు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రిక్క దినకర్ అనే వ్యక్తి కాళీ ఉన్న ప్లాట్లు ఆక్రమించి వేరే వారికి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది.ఈ మధ్య కొందరు కలిసి నిలదీస్తే నీ డబ్బులు మీకు ఇస్తానని కూడా అన్నారని తెలిసింది, ప్రభుత్వం ఇచ్చిన పట్టాలో ఇల్లు కట్టుకోవాలంటే డబ్బులు లేకుండా మూలంగా ఎటువంటి నిర్మాణం చేయలేదు. ఇప్పుడు కడదామని వెళ్తే వేరే వ్యక్తి వచ్చి అడ్డం పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద నేను అయినటువంటి కమ్మరి రాజమాని మహిళకు న్యాయం జరగాలని పై అధికారులని కోరుతున్నను.

# టీబీ రహిత జిల్లాకు సమిష్టి కృషి అవసరం

**- జిల్లా కలెక్టర్ : గరిమా అగ్రవాల్**

**- కొదురుపాకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ టీబీ దినోత్సవం**

**- టీబీ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ**

**- వైద్యులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు ప్రధానం**






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) టీబీ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని బోయినిపల్లి మండలం, కొదురుపాక పీహెచ్‌సీలో నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 15 మంది టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. టీబీ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందిన 20 గ్రామాల కార్యదర్శులు, వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి, డాక్టర్లు, సిబ్బందిని శాలువాలతో సన్మానించారు.జిల్లాలో 42 గ్రామాల్లో 100 రోజులపాటు మొబైల్ ఎక్స్‌రే పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోస్టర్లు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు."ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. "టీబీ ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా పరీక్షలు, మందులు అందజేస్తామని చెప్పారు. బాధితులకు ప్రతి నెల రూ.1000 సహాయం అందుతున్నదని, మందులు క్రమంగా వాడాలని సూచించారు. జిల్లాలో 360 మందికి పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిత, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్ర బాబు, వైద్యులు శంకర్, సత్యనారాయణ, ఆనంద్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు రేణు ప్రియాంక, రాజు కుమార్, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ కె.మంజుల, ఎంపీఓ శ్రీధర్, టీబీ సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో "కృష్ణ లీలలు", నన్నేవరు"పీక లేరు"ఆఫ్ తో టేకాఫ్

- వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారుల నిర్లక్ష్యానికి అమాయకులు బలి
- మార్కెట్ లల్లో ఇష్టానుసారంగా "లైసెన్స్"లు జారీ.సోమ్ము చేసుకుంటున్న కమిటీలు,అధికారులు.?
- నిఘా లేక లక్షలు,కోట్లు పక్కదారి,రైతు పేరుతో "4"రాళ్లు దాచేస్తున్న ఇంటి దొంగలు.?
- మార్కెట్ లో కమీషన్ ఏజెంట్ల ముసుగులో నకిలీ వ్యాపారస్తులు, విజిలెన్స్ లు దాడుల్లో లైసెన్స్ దారులు జాగ్రత్తలు
- కొత్త లైసెన్స్ లతో లక్షలు వసూళ్లు చేస్తుంది ఎవరు, నిఘా లేక నయవంచనకు గురౌతున్న అమాయకులు
- వ్యవసాయ మార్కెటింగ్ చట్టం తెలియక "39"లో లైసెన్స్ కొనుగోలు.సినిమా చూస్తున్న మార్కెట్ అధికారులు.?
- మోసపోతే నీ కర్మ,ఆశను క్యాష్ చేసుకోవడమే నా అదృష్టం అంటున్న లైసెన్స్ దారులు




FORM 8-C
[See Rule 49]
License of Commission Agent under Section 7(1-B) of Telangana (Agricultural Produce & Livestock) Markets Act, 1966

RENEWED LICENSE

No. AMC/B'PALLY/Lic/2018-21/12

The Agricultural Market Committee,
Bowenpally.

As per Rule 49 of the Telangana (Agricultural Produce & Live Stock) Markets Rules, 1969, M/s SRI SAI BABA, Shop No. C-6 , Dr.B.R. Ambedkar Vegetable Market Yard, Bowenpally represented by Sri. C.BALRAJ, S/o. LATE.C.NARSIMHA aged (62) Years, Designation MANAGING PARTNER, Residing at FLAT NO.201, SRI CHAKRA AVENUE, SATYA SAI ENCLAVE, MILITARY DAIRY FARM ROAD, SECUNDERABAD 500015. Contact No 9246193239 is hereby granted Commission Agent license for the notified market and to carry business in the premises described in the schedule below, subject to the provisions of the Telangana (Agricultural Produce & Live Stock) Markets Act, 1966 and the Telangana Agricultural Produce & Live Stock) Markets Rules 1969 on the following conditions, namely:-

The License is valid upto 31/03/202[illegible]

Terms and Conditions

1. The licensee shall abide by the provisions of the Telangana (Agricultural Produce & Live Stock) Markets Act, 1966 and the Rules made thereunder.
2. This License shall not be transferable. In case of any change in the composition of the partners or Directors of the Firm/Company or Management of the Body Corporate, the same shall be communicated in writing to the Agricultural Market Committee within 15 days of such change coming into effect.
3. This License may be suspended or cancelled for violations of the provisions of the Telangana (Agricultural Produce & Live Stock) Markets Act, 1966 and the Rules made thereunder and conditions of this License.
4. In the event of suspension or cancellation of this License, it shall be surrendered to the Agriculture Market Committee.
5. The Licensee shall equip himself to be able to participate in the online trading platform provided by the Government.
6. The licensee shall make all payments relating to the trade settlement, within the stipulated time limits established through the procedures notified in this regard.

For violation of any of the procedures stipulated for participation on the online marketing platform provided by the Government, the licensee shall be liable to be disabled from further participation on the platform.

The Licensee shall generate a Takpatti for every lot sold through him immediately after price determination and Weighment of the lot is completed. The Takpatti shall contain the details of the Commodity, the price determined, the weighment, total sale value, followed by applicable deductions on account of Market charges and Commission Agent commission and the net amount payable to the seller. A copy each of the Takpatti shall be given under acknowledgment to the seller, the market committee and the buyer on the same day.

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** వ్యవసాయ శాఖలో "గోల్ మాల్"గోవిందా.కమిటిలు, అధికారులు అత్యుత్సాహానికి బలి పీఠం ఎక్కుతుంది ఎవరు ? తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 162 మార్కెట్ యార్డ్ లలో వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ కి వస్తుంటాయి.భూమిలో పండే ప్రతి గింజ నుండి పండు వరకు వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారుల పరివేక్షనలో క్రయ విక్రయాలు జరుగుతాయి.

అన్నదాతలు కష్టపడి పండించే పంటకు గిట్టుబాటు ధరతో పాటు,పలు సదుపాయాలు కల్పనలో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ ముందు వరుసలో ఉంటుంది.ఈ నేపథ్యంలో నగరంలో ఉన్న కీలక మార్కెట్ యార్డ్ లో "లైసెన్స్"లు,1969 వ్యవసాయ చట్టంలో లొసుగులను ఆసరాగా చేసుకొని కోట్ల





రూపాయలకు లైసెన్స్ లు కమీషన్ ఏజెంట్లు విక్రయిస్తున్నారు.జంటనగరాల్లో ప్రధానంగా ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్,గుడ్డిమల్కపూర్ మార్కెట్,కొయిడా పండ్ల మార్కెట్,కొత్తపేట మార్కెట్, పటాన్ చెరువు మార్కెట్, వంటి మామిడి మార్కెట్ తదితర మార్కెట్లల్లో గత కొన్నేళ్లుగా

అడ్డదారిలో "మార్కెటింగ్ డిపార్ట్మెంట్ జారీ చేసిన లైసెన్స్ లు అంగట్లో" సేల్ చేస్తున్న షేర్ ఖాన్లూ.వీరు చేసే అక్రమ లైసెన్స్ లు విక్రయాలకు అధికారులే ఫుల్ సపోర్ట్ గా ఉండడం విశేషం. యార్డ్ లో ఇసుమంతైనా యార్డ్ ఇంచార్జ్ కి తెలియ కుండా ఏ పని జరగదు.పాపం అభం శుభం తెలియని అమాయక అన్నదాతలకు అండగా ఉంటామని,అలాగే వారి పంటను మార్కెట్‌లో అమ్మే బాధ్యత తీసుకుంటామని లైసెన్స్ లుపొంది, తర్వాత విక్రయాలకు తెర లేపుతూ క్యాష్ చేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో ఈ మధ్యనే గుడ్డి మల్కపూర్ మార్కెట్ లో ప్రస్తుతం ఉన్న కమీషన్ ఏజెంట్లల్లో "సబ్ డివిజన్"చేసుకోవడంతో పరిమితికి మించి పార్టనర్స్ అయ్యారు.వాస్తవానికి ఆ మార్కెట్లో గణాంకాలు ప్రకారం ఓ లెక్క ఉంటే,గ్రౌండ్లో మాత్రం మరో లెక్క తెర మీదకు వస్తుంది.అదిగాక ఈ మధ్య కొన్ని లైసెన్స్ లు జారీ చేసినట్లు సమాచారం?కింది స్థాయి సిబ్బంది నుంచి వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ వరకు విషయం తెలిసినప్పటికీ చర్యలు శూన్యం.ఎందుకంటే మాకెందుకులే అంటూ ఉన్నతాధికారులు,మీకెమైతే మేమున్నాం అంటూ భరోసా ఇచ్చే యార్డ్ ఇంచార్జులు.ఇలా దొందూ దొందే లా వ్యవహరిస్తూ కాలం నెట్టుకొస్తున్నారు.మరో విషయం ఏమిటంటే సంవత్సరం క్రితం పటాన్ చెరువు మార్కెట్ లో లైసెన్స్ లు మాయాజాలాన్నీ సృష్టించిన మార్కెట్ సూపర్వైజర్.అర్హత కేవలం సూపర్వైజర్ కానీ సార్ రూటే సపరేట్.అదేదో టీవీలో ప్రకటన వచ్చినట్టు "పండు కావాల నాన్నా"అంటూ.చాల తేలికగా "లైసెన్స్ లు జారీ చేసిన"గొప్ప వ్యక్తి.ఇచ్చిన కొత్త లైసెన్స్ లు వెనక భారీగానే కాసులు వెనుకేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.అదిగాక రంగారెడ్డి విజిలెన్స్ అధికారులు సైతం దాడులు చేస్తే భయంకరమైన



నిజాలు వెలుగులోకి వచ్చాయి.ఇవి ఇలా ఉంటే మరో ఊహకందని రీతిలో "వంటి మామిడి"మార్కెట్ లో స్టైల్ ఛేంజ్ చేసిన గనులు.అక్కడ కమిటీ,అధికారులు అవసరం లేకపోయినా లైసెన్స్ లు పదుల సంఖ్యలో జారీ చేసి సొమ్ము చేసుకున్న విషయం వాస్తవం కాదా అంటూ నిలదీస్తున్నారు మార్కెట్ వర్గాలు.విశ్వసనీయ సమాచారం మేరకు, ఆశ్చర్యపోవాల్సిన విషయం ఏమిటంటే అక్కడ సెక్రటరీ ని దాడులు జరిగితే ఏంటి పరిస్థితి అని సదరు వ్యక్తి నిలదీస్తే "ఏ ఉరుకో పెద్దన్న, అయితే సస్పెండ్ అవుతాం అంతేగానీ ఇంకేమన్నా అవుతుందా. అలా జరుగుతే ఇంటిదగ్గర కూచోని సగం గౌరవ వేతనంతో సర్దుకుంటాను. ఈ వ్యవహారం వల్ల వచ్చిన లాభంతో చిరాస్థి కొనుగోలు చేశాంగా దిగులు చెందాల్సిన అవసరం లేదంటూ బయటపడ్డా ఉద్యోగి.? ఈ విధంగా వివిధ రకాల ఆలోచనలతో విధులు నిర్వహిస్తున్న ప్రబుద్ధులు.? ఇలాంటి మనస్తత్వంతో వ్యవహరిస్తున్న వారు కోకొల్లలుగా వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో ఉన్నారు.

## అలవాటు లేక అల్లకల్లోలం..

జంటనగరాల్లో ప్రధానంగా ఉన్న మార్కెట్ లలో గత నాలుగున్నర దశాబ్దాల క్రితం లైసెన్స్ లు పొందిన కమీషన్ ఏజెంట్లు చిత్తశుద్ధితో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారు.అప్పట్లో రైతన్న కూడా కమీషన్ దారులను సొంత కుటుంబ సభ్యులుగా మెదిలే వారు. అది గాక నలభై ఏళ్ల క్రితం వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు సైతం అన్నదాతల పట్ల సుతిమెత్తగా వ్యవహరిస్తు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త పడేవారు.ఇదాంత గతం.ప్రస్తుతం కూరగాయలు, గ్రేన్ మార్చేంట్స్ లో కొత్తదనం చోటు చేసుకుంది.అవి ఏమిటంటే తండ్రులు చేసే వ్యాపారం చిట్కాలు తెలియక,చెతిలో రెండు మూడు డిగ్రీలు ఉండగా, కూరగాయల దందా ఏంటి అంటూ కుటుంబంలో అంతర్గత వివాదాలు రోజు రోజుకు ఎక్కువైపోయాయి.ఈ నేపథ్యంలో లైసెన్స్ దారులు చేసేది ఏమీ లేక పార్టనర్ షిప్ పేరుతో అస్మదియులకు చోటు కల్పిస్తూ,కాసులు వెనుకేసుకుంటున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జారీ చేసిన లైసెన్స్ లో క్లుప్తంగా వివరించినప్పటికి క్రయ విక్రయాలు చేయడం నేరం, ఒకవేళ వ్యాపారం కష్టంగా ఉంటే నియమ నిబంధనలు ప్రకారం మార్కెటింగ్ డిపార్ట్మెంట్ కి అప్పజెప్పాలి కేటాయించిన లైసెన్స్.అధికారులకు ఇస్తే అణ పైసా, మార్కెట్లో విక్రయిస్తే కోట్ల రూపాయలు, రోజు రోజుకు పదుల సంఖ్యలో అమ్మే స్తున్నారు. కొన్న వాళ్లు భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలు పట్టించుకోకపోవడం గమనార్హం.ఈ లైసెన్స్ లు "లక్షలు కాదు ఏకంగా కోట్లల్లో రేటు పలుకుతుంది అంటే ఏ స్థాయిలో పరిస్థితి నెలకొందో అర్థం చేసుకోవచ్చు.బోయిన్ పల్లి మార్కెట్ లో సిత్రాలు చూడతరమా..డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన లైసెన్స్ లు 2001 డిసెంబర్ 20 న"94"లైసెన్స్ లు.తరువాత "38"లైసెన్స్ లు జారీ చేసిన అధికారులు. దీంట్లో వివిధ రకాల కారణాల రీత్యా కొందరు వారికి కేటాయించిన లైసెన్స్ లు వ్యవసాయ శాఖ చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని"ఓనర్ షిప్ 2 శాతం,పార్టనర్ షిప్ పేరుతో 98 శాతంతో సొంతం చేసుకుంటూ అనధికారికంగా కూరగాయల క్రయ విక్రయాలు నిర్వహిస్తున్నారుకొందరు మేధావులు. అన్ని తెలిసిన మార్కెట్ అధికారులు మాత్రం కార్యాలయానికే పరిమితం అయ్యారు.దీని డొంక కదిలాలి అంటే కేవలం"రెన్యువల్ "సమయంలో మాత్రమే చిక్కుతారు ఈ చీరంజీవిలు. మరో వింత విశేషం ఏమిటంటే ఊహకందని అంశం:వీరే అక్రమ దారిలో ప్రయాణం అంటే,వీరు ఇద్దరు నుంచి మొదలు కొని పరిస్థితులు బట్టి నలుగురుకీ కూడా కిరాయిలు యిస్తున్నారు.అడ్వాన్సలతో చిరాస్థులు,కిరాయిలతో ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్న ఛాలేంజర్స్.గమ్మత్తైన విషయం ఏంటంటే అసలైన ఓనర్ సంవత్సరానికి ఒకసారి వచ్చే"ఉగాది పండుగ"లా కన్పియడు,రెండోళ్లకు ఒకసారి వచ్చే"రెన్యువల్ "అప్పుడు మాత్రమే మార్కెట్ కి వస్తారు. లాస్ట్ కి మార్కెట్ అధికారులు సైతం ఒర్జనల్ లైసెన్స్ దారులను మర్చిపోయి, డమ్మీలతోనే దోస్తీ చేస్తున్నారు.

## "39"లైసెన్స్ తో మతిపోయే సంఘటనలు..

బోయిన్ పల్లి మార్కెట్ లో "39"మంది కమీషన్ ఏజెంట్ల విషయంలో అందరికి చిన్న చూపే.నాయకుడు తప్పిందం వల్ల మిగతా వాళ్లు కన్నీటిపర్యంతమయ్యారు. వీరు చేసిన తప్పు న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కడం.? అక్కడితో వారి సమస్య ఆగక తోడు గూడు లేక పది ఏళ్ల క్రితం "94"లైసెన్స్ దారులు వద్ద కిరాయికి తీసుకొని కూరగాయల వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారు.అలా కాలక్రమేణా బోయిన్ పల్లి మార్కెట్ లో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెదజల్లుతున్న సమయంలో ఒక్కసారిగా కూరగాయల వ్యాపారం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో కొందరు తమకు కేటాయించిన లైసెన్స్ లు లక్షల్లో విక్రయించారు. కొన్న వాళ్లు మార్కెట్ సిబ్బంది నుంచి అధికారులు వరకు ప్రతి రోజూ దినదినగండంలా భయపడుతూ వ్యాపార లావాదేవీలు చేపట్టారు. ఇప్పటికి కొంతమందికి తెలియని విషయం ఏమిటంటే మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన "39"లైసెన్స్ లు "సోల్ట్ ప్రొపర్టర్". దీని అర్థం క్రయ విక్రయాలు ఉండవు,పార్టనర్ షిప్ పేరుతో ముందుకు సాగరు.కానీ అన్నీ తెలిసిన మార్కెట్ అధికారులు మాకేం సంబంధం లేదంటూ ఉంటారు.అభం శుభం తెలియని వ్యక్తులకు మార్కెట్ చట్టం పై అవగాహన కల్పిస్తే కొనుగోళ్లు ఆగుతాయి."39" కమీషన్ ఏజెంట్లకు ఎటువంటి సదుపాయాలు కల్పించకపోయినా కష్టమో, సుఖమో వారి బాధలు వారు పడుతున్నారు.ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు కొన్ని రోజుల క్రితం "39"లైసెన్స్ లో ఒక లైసెన్స్ సుమారు "50"లక్షల రూపాయలకు విక్రయించినట్లు సమాచారం. సొమ్ము చేసుకున్న వ్యక్తి విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు.కొన్నవాడు (ఎంఆర్టీ లో కిరాయి దారుడు ఎల్లేష్ గా సమాచారం.) భయం గుప్పెట్లో పాగ వేసుకుని ఉంటుందా పోతుందా భ్రమలో బతుకు తున్నారు.మరో విషయం ఏమిటంటే సార్ పెద్ద ముదురు,కొనుగోలు చేసిన అనంతరం ఇద్దరికీ కిరాయికి ఎంగేజ్ చేశాడంటే బోయిన్ పల్లి మార్కెట్ లో అడిగే వాడు లేడని,ఎంతకైనా తెగబడుతున్న వైనం కళ్ల ముందు కన్పిస్తుంది. ఆశ్చర్యం ఏమిటంటే మార్కెట్ అధికారులకు గౌరవ వేతనం, గేట్ ఎంట్రీ, మార్కెట్ ఫీజు చెల్లిస్తే చాలు,మరే విషయాలతో తల దూర్చకుండా వ్యవహరిస్తారు. ఇప్పటికైనా సంబంధింత వ్యవసాయ శాఖ మంత్రి, ఉన్నత అధికారులు జోక్యం చేసుకుంటే గానీ సమస్య ఓ కొలిక్కి రాదు.

## పాతవి విక్రయిస్తే చర్యలు,కొత్త లైసెన్స్ పై సమాచారం లేదు: చైర్మన్

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నూతనంగా మరో ఎనిమిది లైసెన్స్ లు మార్కెటింగ్ శాఖ జారీ చేస్తునట్లు,అలాగే ఈ మధ్యనే "39"లైసెన్స్ లో ఒక లైసెన్స్ సుమారు యాభై లక్షల రూపాయలకు సదరు కమీషన్ ఏజెంట్ విక్రయించి నట్లు విశ్వసనీయసమాచారం.? ఈ అంశం పై బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబుని "ఆన్ లైన్"లో వివరణ కోరగా ఆయన వ్యవసాయ మార్కెటింగ్ చట్టంలో కొన్ని నియమాలకు లోబడి లైసెన్స్ లు జారీ చేసిన విషయం విదితమే!కానీ లైసెన్స్ పత్రం వెనుక నియమాలు పట్టికలో స్పష్టంగా కొన్ని విషయాలు పేర్కొన్నారు.అయిన కూడా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని,అలాగే ఉన్నతాధికారులు,న్యాయ నిపుణుల సలహాతో లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో గతంలో జారీ చేసిన లైసెన్స్ లకే చోటు లేక ప్రతి రోజూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.నిత్యం ఇరవై తొమ్మిది వేల టన్నుల కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి,ఒక్కోసారి డబుల్ మార్కెట్ తో మార్కెట్ అధికారులు,సిబ్బంది ట్రాఫిక్ జామ్ తో తలలు పట్టుకుంటున్నారు.దిగుమతిఅయిన కూరగాయలు విక్రయించడానికి కమీషన్ ఏజెంట్లకు కత్తిమీద సాము లాంటిదే.అదిగాక సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ వారు గతంలో బోయిన్ పల్లి మార్కెట్ లో కొత్త లైసెన్స్ లు ఇవ్వద్దంటూ కోర్టుకు వెళ్లిన విషయం అందరికి తెలిసిందే.ఒకవేళ నూతన లైసెన్స్ లు ఇవ్వాలంటే యార్డ్ ను ఆనుకొని ఉన్న ఎల్ఐసి స్థలం మార్కెట్ ఆధీనంలో ఉంటే గానీ మరిన్ని లైసెన్సులు ఇచ్చే అవకాశం ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు వెల్లడించారు.

# జీవన యాత్ర

## - సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ తో సీనియర్ నేత జీవన్ రెడ్డి ప్రయాణం ముగిసింది. దాదాపు నాలుగు దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ లో ఉంటూ వివిధ పదవులను అధిష్టించిన జీవన్ రెడ్డి నేడు తన అనుచరులతో సమావేశమై తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు.

ఎంత మంది బుజ్జగించినా, చివరి నిమిషంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వచ్చి నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. ఆయన బీఆర్ఎస్ లోనే చేరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జగిత్యాల రాజకీయాల్లో దశాబ్దాల పాటు చక్రం తిప్పిన జీవన్ రెడ్డి, చాలా కాలం నుంచి కాంగ్రెస్ పార్టీలో తనకు ఎదురవుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

### ఇన్నాళ్లు పట్టించుకోని నేతలు

గత కొన్నాళ్లుగా పట్టించుకోని నేతలు ఆయన పార్టీ మారుతున్నారని ప్రకటించిన తర్వాత వచ్చి నచ్చ చెప్పే ప్రయత్నాలు చేయడం మాత్రం విడ్డూరమే అనుకోవాలి. ముఖ్యంగా తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం, ఆయనకే ప్రాధాన్యత ఇవ్వడంపై రగిలిపోతున్న జీవన్ రెడ్డి పార్టీ మారిపోవాలని డిసైడయ్యారు. అయితే ఏదో పార్టీ మారిపోయి కండువా కప్పుకుంటే ఎఫెక్ట్ రాదని కొత్తగా ప్రయత్నిస్తున్నారు. తనకు కాంగ్రెస్ పార్టీలో జరిగిన అన్యాయాన్ని నియోజకవర్గంలో చెప్పేందుకు కూడా జీవన్ రెడ్డి సిద్ధమయ్యారు.

### నియోజకవర్గంలో యాత్ర

ఇందుకోసం జీవన్ రెడ్డి జగిత్యాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. తనకు కాంగ్రెస్‌లో అన్యాయం జరిగిందనే సెంటిమెంట్‌తో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తారన్న ప్రచారం మాత్రం జోరుగా జరుగుతుంది. ఇప్పురేపు అధికారికంగా రాజీనామా ప్రకటన చేసిన తర్వాత, గ్రామ గ్రామాన తిరుగుతూ తన ఆవేదనను ప్రజలకు వివరించి, సానుభూతిని కూడగట్టాలని ప్లాన్ చేస్తున్నారు. జీవన్ రెడ్డి ఇప్పటికే తన తదుపరి రాజకీయ అడుగులపై ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రాథమిక చర్చలు పూర్తి చేశారు. కాంగ్రెస్ అధిష్టానం తనను విస్మరించిందనే పాయింట్‌ను బలంగా వాడుకుంటూ మరొకపార్టీలో చేరడం ద్వారా తన ఉనికిని చాటుకోవాలని చూస్తున్నారు.

### వయసుతో పాటు..

ఇక్కడ ప్రధానమైన చర్చ జీవన్ రెడ్డి వయసు, ఆయనకున్న ప్రజాదరణ పై కూడా ప్రజల్లో చర్చనీయాంశమైందని చెప్పాలి. జీవన్ రెడ్డి వయసు ప్రస్తుతం 75 ఏళ్లు దాటింది.

ఈ వయసులో ఆయనకు అన్యాయం జరగడంపై సామాన్య జనం నుంచి కూడా సానుకూల స్పందన కనిపిస్తోంది. జగిత్యాల ప్రజలకు ఆయన రాజకీయ ప్రస్థానం మొత్తం తెలుసు.అప్పట్లో ఆయన చేసిన అభివృద్ధి, ఇప్పుడు ఆయన పడుతున్న ఆవేదన మధ్య ప్రజలు దేనికి ప్రాధాన్యత ఇస్తారనేది కీలకం. వయసు మళ్లిన వేళ ఆయన చూపే ఈ సెంటిమెంట్ కార్డ్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందనేది చూడాలి. కానీ ఒకటి మాత్రం నిజం. జీవన్ రెడ్డికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నేతలే అంగీకరిస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా అదే భావనలోకి వస్తారన్న విశ్లేషణలు కూడా వినపడుతున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588